





24 గంటలూ.. గజ గజ

వాతావరణ మార్పు.. వణుకుతున్న జనం

- కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు
- గజగజలాడుతున్న ప్రజానీకం
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- అల్పపీడన ద్రోణి ప్రభావం
- మరో మూడు రోజులింతే

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాను చలి వణికించింది. ఉదయం నుంచి రాత్రి వరకూ వాతావరణం ఏ మాత్రం మారలేదు. మబ్బు.మబ్బుగానే కనిపించింది. అంతే కాకుండా మధ్యాహ్నం సమయం లోనూ చలి వీడలేదు. చంటి బిడ్డలు మొదలు కొని వృద్ధుల వరకు చలి తీవ్రతకు గజగజలాడారు. గత మూడు రోజులుగా వాతావరణంలో తేడావచ్చింది. చలి పెరిగింది. రాత్రి సమయాల్లో అయితే ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. తెల్లవారుజామున ఏ స్థాయిలో చలి ఉందో అదే తీవ్రత 24 గంటలు పాటు కొనసాగడం గతంలో ఎన్నడూ చూడలేదు. మధ్యాహ్నం సమయానికి ఉపశమనం ఉండేది. అయితే మంగళవారం మాత్రం చలి పెరుగుతూనే ఉంది. జిల్లా ప్రజలను వణికించింది. చలిని తట్టుకోలేక చలి మంటలు వేసుకునే పరిస్థితి నెలకొంది.శీతాకాలంలో సాధారణంగా చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయితే దీనికి అల్పపీడన ద్రోణి ప్రభావం తోడు కావడంతో చలి తీవ్రత పెరిగింది. రోజంతా మబ్బు వాతావరణం ఉంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి లాంటి ప్రాంతాల్లో సగటున ఉష్ణోగ్రత 27 నుంచి మొదలు కొని 32 డిగ్రీల మధ్య ఉంటుంది. అలాంటి ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం 22 నుంచి 27 మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఖచ్చితంగా చలి కోట్లు వేసుకుని, మాస్కులు ధరించి వెళ్లాల్సిన పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కాలువలు,పంట పొలాలు, తోటలకు నీరు పెట్టడం తదితర పనులతో అక్కడ చలి మరింత ఎక్కువ కావడంలో వణుకుతున్నారు. స్కూల్ పిల్లలు వణుకుతూ స్కూల్‌కి వెళుతున్నారు. వివిధ పనులపై బయటకు వెళ్లేవారు కూడా చలి తీవ్రతకు బేంబేలెత్తుతున్నారు.చిన్నారులు చలికి తట్టుకోలేక పాఠశాలలకు ఆలస్యంగా వెళుతున్నారు. చలి తీవ్రత కారణంగా పాఠశాలల ఆరంభ సమయం మార్పుచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చలిగాలుల వేగం గంటకు 11 కి.మీ

జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో చలిగాలుల తీవ్రత మరింతగా పెరిగింది. సాధారణస్థితిలో చలి తీవ్రత ఒక మోస్తరు ఉంటుంది. దానికి అల్పపీడన ద్రోణి తోడు కావడంతో గంటలకు 11 కిమీల వేగంతో చలిగాలులు వీస్తున్నాయి.దీని ప్రభావంతో 24 గంటలూ చల్లగానే ఉంటుంది.తలుపులు, కిటికీలు గుండా చలిగాలులు వీచి ఇంటా బయటా ఏసీ మాదిరిగా ఉంటుంది. మరొక మూడు రోజుల పాటు ఇలాంటి పరిస్థితే కొనసాగుతుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి..

చలిగాలులు కారణంగా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.చలి ప్రభావం చిన్నారులు, వృద్ధులపై ఎక్కువగా ఉంటుంది. బయటకు వెళితే తప్పనిసరిగా మంకీ క్యాప్, స్వెట్టర్ వినియోగించాల్సిందే. ప్రస్తుతం జలుబు, దగ్గు తదితర సమస్యలతో చిన్నారులు బాధపడుతున్నారు.



అంతా సత్యం!

గత నెల 29న స్టెల్లా షిప్‌లో బియ్యం తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ (ఫైల్)

స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం

- అంతా సత్యం బాలాజీ కంపెనీదే
- 1320 మెట్రిక్ టన్నులు పట్టివేత
- చత్తీస్‌గఢ్ కంపెనీ పేరు
- జూలైలో పట్టుబడ్డ బియ్యం
- పాలిష్‌చేసి మళ్లీ ఎగుమతి
- గుట్టు తేల్చేపనిలో అధికారులు
- నిలిచిపోయిన బియ్యం లోడింగ్
- హైకోర్టులో వ్యాపారుల పిటిషన్
- నేటి నుంచి ముమ్మర దర్యాప్తు
- నౌకలో బియ్యం దించాలని ఆదేశం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)


స్టెల్లా నౌకలో రేషన్ గుట్టు వీడింది.. విదేశాలకు తరలిపోవడానికి సిద్ధమైన పేదల బియ్యం లెక్కతేలింది. అధికారుల కళ్లుగప్పి.. చెక్ పోస్టులను మాయచేసి సముద్రాలను దాటించేయడానికి చూసిన బియ్యం స్మగ్లింగ్ దందా బయట పడింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 1,320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి దేశాలు దాటించేయడానికి చూసిన అక్రమార్కుల పాపం పండింది. ఈ నేపథ్యంలో గుర్తించిన బియ్యాన్ని నౌక నుంచి కిందకు దించేయడానికి అధికారులు నిర్ణయించారు.అసలు ఈ బియ్యం సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై నేటి నుంచి దర్యాప్తు చేయబోతున్నారు. ఏ మిల్లుల నుంచి ఈ సరుకు వచ్చింది? చత్తీస్‌గఢ్‌కు చెందిన సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఇక్కడ సహకరిస్తున్నదెవరు అనే గుట్టులాగనున్నారు. నౌక నుంచి రేషన్‌బియ్యం దించేయాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ ప్రస్తుతం సముద్రంలో అల్లకల్లోల వాతావరణంతో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. మరోపక్క ఈ అన్‌లోడింగ్ పూరయ్యాకే మిగిలిన బియ్యాన్ని లోడ్‌చేసి పది రోజుల్లో స్టెల్లా కదలడానికి అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతికి అధికారులు అనుమతించడం లేదని కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించడం విశేషం.

స్టెల్లా కదిలేది అప్పుడేనా...

పనామా ఫ్లాగ్‌తో ఉన్న స్టెల్లా నౌక కాకినాడకు బియ్యం లోడింగ్‌కు వచ్చి 35రోజులుపైనే దాటుతోంది. ఇందులో రేషన్ బియ్యం లోడైన నేపథ్యంలో అదనపు తనిఖీలు, శాంపిళ్ల కోసం ఈ నౌకలోకి బియ్యం లోడింగ్‌ను అధికారులు నిలిపివేశారు. దీంతో అప్పటి నుంచీ ఈ నౌక కాకినాడలోనే ఉండిపోయింది. అయితే ఇప్పుడు శాంపిళ్ల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో గుర్తించిన రేషన్ బియ్యాన్ని దించేయనున్నారు. ఈమేరకు పోర్టు అధికారులు కస్టమ్స్ విభాగంతో సంప్రదింపులు జరపగా బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ మొదలుపెట్టి రెండు రోజుల్లో సరుకంతా దించేయాలని భావించారు. తీరా అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలోపల గంటకు 48 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండడంతో బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ సాధ్యం కాదని తేల్చేశారు. వాతావరణం సద్దుమణిగిన తర్వాత బియ్యం అన్‌లోడింగ్ చేయడం, ఇంకా మిగిలిన 12 వేల మెట్రిక్ టన్నులు నౌకలోకి లోడింగ్ చేయాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ పూర్తికావడానికి దాదాపు రెండు వారాలకుపైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతే కాకినాడ నుంచి స్టెల్లా నౌక కదలనుంది. కాగా స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఉన్నాయనే కారణంతో ఈ నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతి చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారంటూ మూడు బియ్యం ఎగుమతి కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో హైకోర్టు విచారణలో భాగంగా నౌకలో బియ్యం లోడింగ్ జరగకుండా ప్రభుత్వానికి అడ్డుకునే అధికారాలు ఏమిటని న్యాయస్థానం మంగళవారం ప్రశ్నించింది. ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది.

ఆ బియ్యం అవే..

కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా రేషన్ బియ్యం ఎగుమవుతున్నాయన్న వైనం మరోసారి పక్కా ఆధారాలతో బయటపడింది. ఈమేరకు స్టెల్లా షిప్‌లో అధికారులు డిసెంబరు 4న సేకరించిన 12 శాంపిళ్ల నిజాలను నిర్ధారించాయి. షిప్‌లో ఐదు హేచ్‌ల్లో లోడైన మొత్తం 32,416 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంలో మూడో నెంబర్ హేచ్‌లో ఎగుమతికి సిద్ధం చేసిన పది వేల మెట్రిక్ టన్నుల సరుకులో రేషన్ బియ్యం ఆనవాళ్లు తేలాయి. ఈ బియ్యం అంతా సత్యం బాలాజీ కంపెనీదిగా అధికారులు గుర్తించారు. వాస్తవానికి స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఎగుమతి జరుగుతుందనే సమాచారంతో గత నెల 29న డిప్యూటీ సీఎం పవన్ అక్కడకు వెళ్లి షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. ఆ సమయానికి నౌక హేచ్-1లో 640 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధారించారు. అయితే మిగిలిన హేచ్‌ల్లో లోడైన బియ్యాన్ని కూడా తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది జూలైలో పట్టుబడ్డ 42 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని న్యాయస్థానం ఆదేశాలతో బ్యాంకు గ్యారంటీలు తీసుకుని వ్యాపారులకు తిరిగి అప్పగించేశారు. అయితే నౌకలో పట్టుబడ్డ బియ్యం.. అప్పట్లో వెనక్కు ఇచ్చేసిన బియ్యం ఒకటేనా అనే దానిపైనా శాంపిళ్లను సరిపోల్చగా మొత్తం బండారం బట్టబయలైంది. అప్పుడు వెనక్కు ఇచ్చేసిన బియ్యం, షిప్‌లో లోడైన బియ్యం ఒకటేనని ఎట్టకేలకు తేలింది. స్టెల్లా నౌకలో లోడైన 15 కంపెనీలకు చెందిన 32,416 మెట్రిక్ టన్నుల బియ్యంలో సత్యం బాలాజీ అనే కంపెనీకి చెందిన 10 వేల మెట్రిక్ టన్నుల్లో మొత్తం 1,320 మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 640 మెట్రిక్ టన్నులు గతంలో గుర్తించిందే కాగా అదనంగా శాంపిళ్ల ద్వారా 680 మెట్రిక్ టన్నులు కొత్తగా రేషన్‌గా బయటపడింది. ఇదంతా నౌక నుంచి దించేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే చత్తీస్‌గఢ్‌కు చెందిన సత్యం బాలాజీ కంపెనీ కాకినాడ యాంకరేజ్‌పోర్టు ద్వారా రేషన్ బియ్యం ఎగుమతికి బరితెగించిందంటే అసలు ఇంత బియ్యం ఆ కంపెనీకి ఎలా వచ్చాయనేది విస్మయ పరుస్తోంది. ఈ బియ్యం అంతా కాకినాడ జిల్లాలో సేకరించినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నేటి నుంచి దర్యాప్తు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ కంపెనీ తరపున బియ్యాన్ని షిప్‌లోకి ఎగుమతి చేస్తోన్న లోటస్ మెరైన్ లాజిస్టిక్స్ అనే షిప్పింగ్ కంపెనీ ప్రతినిధులను విచారించనున్నారు. మరో పక్క జులైలో పట్టుబడ్డ తమ రేషన్ బియ్యాన్ని సత్యం బాలాజీ కంపెనీ తిరిగి మిల్లుల్లో పాలిష్ చేసి ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తోన్న నేపథ్యంలో ఇందుకు సహకరించిన మిల్లులపైనా గురి పెట్టనున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సత్యం బాలాజీ రేషన్ అక్రమాల డొంక కదిల్చి పెద్దఎత్తున పీడీ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. మిల్లుల బాగోతమూ బట్టబయలుకానుంది.



మంత్రిగారూ! ఎన్నికలెప్పుడు?

గత ప్రభుత్వంలో జరగని కార్పొరేషన్ ఎన్నికలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహించి పదేళ్లు దాటేసింది.2019లో వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత కార్పొరేషన్ ఎన్నికలను అసలు పట్టించుకోలేదు.దీంతో గత ఐదేళ్ల కార్పొరేషన్‌కు పాలకవర్గం లేకుండా పోయింది. ప్రత్యేకాధికారుల పాలనలోనే నడిచింది. దీంతో గత వైసీపీ నాయకుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. ఇష్టాను సారంగా నిధులు ఖర్చు చేసేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ఎన్నికల మీద ఆశ కలిగింది.పాలక వర్గం లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని.. డివిజన్లలో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ప్రజ లంతా వాపోతున్నారు. గతంలో మా డివి జన్‌లో సమస్య ఉంటే కౌన్సిలర్‌కు తెలియజేసే వారమని..ఏదో ఒక విధంగా పరిష్కారమయ్యేదని.. ఇప్పుడు ఎవరికి చెప్పాలో అర్థం కావడంలేదని వాపోతున్నారు. ఎన్నికలతో పాటు సుమారు 20 గ్రామాల విలీన సమస్య ఉంది.వాటిని విలీనం చేసి గ్రేటర్ రాజమహేంద్రవరంలో అభివృద్ధి చేయాలనేది స్థానిక ప్రజల కోరిక.ఇటు ఎన్నికలు జరగలేదు. గ్రామాల విలీనమూ లేదు. ఆ గ్రామాలకు ఎన్నికలూ జరగలేదు. ఎన్నికలు లేకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదనే ఆందోళన ఉంది. మంత్రి గ్రామాల విలీనం.. ఎన్నికలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మంత్రి నారాయణ పర్యటన

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ బుధవారం రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారు. క్వారీ సెంటర్‌లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. ఉదయం 9 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుని ప్రజాప్రతినిధులు ,అధికారులతో చర్చిస్తారు.

పనులు కాకుండానే..బిల్లులు చెల్లింపులు



కడియం సామాజిక తనిఖీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

- సామాజిక తనిఖీలో గుర్తింపు
- పీఆర్ సిబ్బందిపై మండిపాటు
- వెంటనే పూర్తిచేయాలని ఆదేశం
- కడియంలో డ్వామా పీడీ

కడియం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగం సహించనని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు అన్నారు.కడియం మండలంలో పంచాయతీరాజ్ శాఖ వారు పనులు పూర్తి కాకుండా ముందస్తు బిల్లులు చెల్లింపుపై మండిపడ్డారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన పనుల్లో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ జరిగింది. ఈ నెల 4 నుంచి 12 వ తేదీ వరకు మండలంలో జరిగిన పనులను పరిశీలించారు. ఈ సామాజిక తనిఖీల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాలకు సంబంధించి రూ. 6,37,854 ముందస్తు చెల్లించినట్టు గుర్తించారు. వెంటనే ఆ పనులు పూర్తి చేసి ఫొటోలతో సహా ఆధారాలు చూపించాలని పంచాయతీరాజ్‌శాఖకు ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులు సక్రమంగా నిర్వహణ లేకపోవడంతో రూ.4 వేలు జరిమానా విధించారు. వివిధ గ్రామ పంచాయతీల్లో ఉపాధిపనుల మస్తర్లు దిద్దుబాటుతో పాటు సక్రమంగా లేకపోవడంతో రూ. 17 వేలు రికవరీకి ఆదేశించారు. మండలంలో 627 పనులకు వేతన విలువ రూ. 1,61,89,393, మెటీరియల్ విలువ రూ. 3,07,30,607 కలిపి మొత్తం రూ 4,69,20,000 పై సామాజిక తనిఖీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, ఏపీడీ రామ్‌ప్రసాద్, ఎంపీడీవో కె రమేష్, సోషల్‌ఆడిట్ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు
దరఖాస్తుల ఆహ్వానం
ఈ నెల 31వ తేదీ వరకు గడువు
దరఖాస్తు రుసుం రూ.15 లక్షలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 12 ప్రీమియం లిక్కర్ స్టోర్ను ఏర్పాటు చేసుకునేందుకు గెజిట్‌ను జారీ చేసిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ అధికారి సీహెచ్ లావణ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఒక్కొక్కస్టోర్ చొప్పున ఏర్పాటు చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను ఆఫ్‌లైన్‌లో అందించాలని సూచించారు. దరఖాస్తు రుసుం రూ.15 లక్షలు కాబట్టి ఆన్‌లైన్‌లో తప్పిదాలు జరిగే ఆస్కారం ఉన్నదందున ఆఫ్‌లైన్ విధానంలోనే ఇది జరుగుతుందని పేర్కొన్నారు.ఈ స్టోర్ లైసెన్స్ కాలపరిమితి ఐదేళ్లు. మొదటి సంవత్సరం లైసెన్సుదారులు చెల్లించాల్సిన వార్షిక పన్ను రూ.కోటి , రెండో ఏడాది నుంచి 10 శాతం పెరుగుదల ఉంటుందన్నారు. ప్రీమియం స్టోర్ కనీస కార్పెట్ వైశాల్యం 4000 చదరపు అడుగులు ఉండాలన్నారు.ప్రీమియం స్టోర్ దరఖాస్తు కోసం హెచ్‌టీపీఎస్://ఏపీఎస్‌బీసీఎల్.ఏపీజీవోవీ.ఇన్ నందు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. దరఖాస్తుదారులు గమనించాలని సూచించారు.

భీమోలు భూములపై జేసీ విచారణ


రైతులతో మాట్లాడుతున్న జేసీ

గోపాలపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమోలు గ్రామంలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న ల్యాండ్ సీలింగ్ భూములపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విచారణకు ఆదేశించారు.ఈ మేరకు జేసీ చినరాముడు మంగళవారం భీమోలు గ్రామంలోని సచివాలయం వద్ద విచారణ చేపట్టారు.భీమోలు సచివాలయం వద్దకు మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు చేరుకున్న జేసీ మొదట జమిందారి వారసులు పట్టాదారులతో విడివిడిగా మాట్లాడి వారు తెలిపిన వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం గోపాలపురం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో కౌలుదారులతో జేసీ మాట్లాడారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు కొవ్వూరు ఆర్డీవో వద్దకు వచ్చి కౌలుదారుల అభిప్రా యాలు తెలపాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత, తహశీల్దార్ అజయ్‌బాబు, ఎస్‌ఐ కే.సతీష్ కుమార్ ఉన్నారు.


కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి,ఎమ్మెల్యేలు

దివ్యాంగులను ప్రోత్సహించండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల సానుభూతిని చూపించడం కాదని వారిలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించి వారికి భవిష్యత్‌ను ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ సభకు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు సామాజిక భద్రత పెన్షన్ కింద ఇంటి వద్దే రూ.6 వేలు ప్రతినెలా అందిస్తుందని.. పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు మెకనైజ్ బ్యాటరీ ట్రైసైకిల్స్, ట్రైసైకిల్స్, దివ్యాంగుల చైర్స్ కోసం ఎక్కువ విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. జిల్లాలో దివ్యాంగుల కోసం పనిచేస్తున్న జియోన్‌పలుకు, సంకల్పం ఫస్ట్, కన్నా వంటి సంస్థల భాగస్వామ్యం స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గత ప్రభుత్వం జియోన్ సంస్థకు సంబంధించి దివ్యాంగుల ఆశ్రయాన్ని ఖాళీ చేయించడం అన్యాయమన్నారు.జిల్లా కలెక్టర్ వారికి తగు న్యాయం చేయాలని కోరారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులకు సహకరించాలన్నారు. దివ్యాంగులకు అవకాశం ఇస్తే ఏదైనా సాధిస్తారన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులను సత్కరించి జ్ఞాపిక అందించారు.కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవిని కలెక్టర్ ప్రశాంతి,ఎమ్మెల్యేలు సత్కరించారు.తొలుత కన్నా ఫౌండేషన్, ధవళేశ్వరం పలుకు సంకల్ప పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 742 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటి వరకూ 70 గ్రామ పంచాయతీల పరిధిలోని రెవెన్యూ సదస్సులు నిర్వహించి,742 అర్జీలు స్వీకరించామని వాటిలో 95 ఇప్పటికే పరిష్కరించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరు గుతాయన్నారు.అర్జీల పరిష్కారంలో అధికా రులంతా టైంలైన్‌తో కూడిన మార్గదర్శకాలు పాటించాలన్నారు.జవాబుదారీతనం ఉండే విధంగా అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని,ప్రతి నియోజకవర్గ బాధ్యత ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు అప్పగించామన్నారు.

పోలీసులపైనే ఎటాక్ చేశారు.. అడ్డంగా బుక్కయ్యారు!

చేసేది తప్పుడు పని.. తమ ముఠా నాయకుడు చిక్క కూడదని మరో తప్పు చేసేశారు.. దొంగనోట్ల కేసులో అరెస్టు చేసి తీసుకెళుతున్న ముఠా నాయకుడిని తప్పించేందుకు పోలీసుల మీదే ఎటాక్ చేశారు.. పోలీసులు ఊరుకుంటారా.. తీగలాగితే డొంక కదిలింది.. ఏకంగా రెండు జిల్లాల్లో దొంగ నోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్న ముఠాను పట్టుకున్నారు.. మంగళవారం అరెస్టు చూపించారు.. దీంతో 18 మంది దొంగనోట్ల ముఠా సభ్యులు అడ్డంగా బుక్కయ్యారు..వీరిలో 13 మంది జైలులో ఊచలు లెక్కపెడుతుండగా మరో ఐదుగురు పరారీలో ఉన్నారు.. - వివరాలు 7లో


పోలీసులకు చిక్కిన 13 మంది నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

2.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకూ 2.32 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ ఎస్. చిన్నరాముడు తెలిపారు.మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 29,101 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రూ.488 కోట్లు జమ చేశామన్నారు.ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే డబ్బు జమ చేస్తున్నామన్నారు.

నేడు అంతర్జాతీయ వలసదారుల దినోత్సవం



బర్మా కాలనీలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయం



రాజమహేంద్రవరంలో బర్మా కాలనీ

ఆకలి, ఆశ్రయం..ఈ రెండు మనిషిని ఎంత దూరమైనా తీసుకువెళ్తాయి..ఉన్న ప్రాంతంలో ఉండలేని పేద బతుకులు పొట్ట చేతపట్టుకుని ఎందాకైనా వెళ్తాయి.. ఇలా ఒక ఊరి నుంచి మరో ఊరు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రం, ఒక దేశం నుంచి మరో దేశం...ఎక్కడ తమకు పని దొరికితే, ఎక్కడ తమ ఆకలి తీరితే అక్కడికి వలస వెళ్లిపోతారు.. అలా 60 ఏళ్ల క్రితం బర్మా దేశం నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన వారితో రాజమహేంద్రవరంలో ఓ కాలనీయే ఏర్పడింది..

ఆ పేరుతో ప్రత్యేక ప్రాంతం....
60 ఏళ్ల క్రితం స్పిన్నింగ్ మిల్లులో పనికి
అక్కడ నుంచి వచ్చిన కుటుంబాలు
కొందరు తిరిగి వెళ్లిపోగా..
ఇంకా కొందరు ఇక్కడే..

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి): ఈ భూమి ఎవరికీ శాశ్వతం కాదు. బతుకుదెరువు కోసం ఉన్న ఊరిని వదిలి అనేక మంది ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వెళ్లి అక్కడ స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. పుట్టుక ఒక ప్రాంతంలో అయితే జీవితం మరొక ప్రాంతంలో ఉంటుంది. ఇలా మనిషి జీవన గమనంలో వలస కూడా ఓ భాగమైంది. 1966-1977లో రాజమహేంద్రవరం రూరల్ ప్రాంతంలో స్పిన్నింగ్ మిల్లును ఏర్పాటు చేశారు. ఈ మిల్లులో పని చేయడానికి మయన్మార్ (బర్మా) నుంచి 280 కుటుంబాలను తీసుకువచ్చారు. వారంతా రాజమహేంద్రవరంలో ప్రస్తుత బర్మా కాలనీలో ఉన్న ప్రాంతంలోను, క్వారీ సమీపంలోని మరొక ప్రాంతంలోను నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉండేవారు. అక్కడి నుంచి వారంతా స్పిన్నింగ్ మిల్లులో పనిచేసేందుకు వెళ్లేవారు. అదే విధంగా ఈ మిల్లులో పనిచేయడానికి సిలోను నుంచి కూడా చాలా మంది వచ్చి రాజమహేంద్రవరంలోనే స్థిరపడ్డారు. ఇలా బర్మా నుంచి వచ్చిన వారంతా రాజమహేంద్రవరంలోనే నివాసం ఉండటానికి అప్పట్లో క్వార్టర్లు కూడా నిర్మించారు. అవన్నీ ప్రస్తుతం కనుమరుగయ్యాయి. బర్మా నుంచి అప్పట్లో పెద్దవాళ్లు రావడంతో ఇక్కడకు వచ్చిన తర్వాత పిల్లలు పుట్టడంతో వారంతా ఇక్కడే స్థిరపడిపోయారు. కొంతమంది బర్మాకు తిరిగి వెళ్లిపోయారు. అతి కొద్ది మంది మాత్రమే బర్మా కాలనీలో ఉండిపోయారు.

సంబంధాలు లేవు..

ప్రస్తుతం ఇక్కడ ఉన్నవారికి, బర్మాకు ఎటువంటి సంబంధాలు లేవు. అందరూ ఇక్కడి వారితో కలిసిపోయారు. తమ పూర్వీకులది బర్మా అని కూడా పూర్తిగా తెలియని పరిస్థితి. వారంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారుగా చెబుతారు. తొలినాళ్లలో బర్మా సంప్రదాయాలను వారు పాటించినప్పటికీ కాలక్రమేణా మారిపోయారు. కనీసం ఆ భాష తెలిసిన వారు కూడా లేరు. కానీ ఒకప్పటి బర్మా నుంచి 280 కుటుంబాలు మాత్రం రాజమహేంద్రవరం వచ్చి ఇక్కడే ఉండేవారని మాత్రం చెబుతారు. అందుకే బర్మాకాలనీకి ఈ పేరువచ్చింది. అదేవిధంగా క్వారీ రోడ్డులో కూడా వారు ఉండడంతో అక్కడ కూడా ఓ బర్మా కాలనీ ఉంది.

శ్రీలంక కూడా..

రాజమహేంద్రవరంలో లూథర్‌గిరి వెనుక ప్రాంతంలో క్వారీ గోతుల్లో నీటి మధ్యలో కొంత ప్రాంతంలో స్థానికులు గుడిసెలు వేసుకుని జీవనం సాగించేవారు. ఈ ప్రాంతం లంకను తలపించే విధంగా ఉండేదని దానిని శ్రీలంకగా నామకరణం చేసుకున్నారు. శ్రీలంకతో దీనికి ఎటువంటి సంబంధం లేకపోయినా పేరు మాత్రం పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బిల్డింగ్‌లు వచ్చాయి, వర్షం పడితే ఇప్పటికి ఈ ప్రాంతం చుట్టూ మునిగి లంక మాదిరిగా తయారవుతుంది..



తెలుగు సంప్రదాయాలు.. ఆచార వ్యవహారాలు

వలసదారులు వచ్చి స్థిరపడిన ప్రాంతాలకు ఆయా దేశాల పేర్లు పెట్టి స్థానిక ప్రజలే పిలవడంతో అప్పటి నుంచి ఆ పేర్లనే కొనసాగిస్తున్నారు. ఇక్కడ మిగిలిన పోయిన బర్మా వాసులు తెలుగు సంప్రదాయాలను, స్థానిక ఆచారాలను కొనసాగించడం ప్రారంభించారు. ఇప్పుడు పూర్తిగా తెలుగు వాళ్లలో కలిసిపోవడంతో పేరుకే బర్మా కాలనీ అయినా ఇక్కడ బర్మా నుంచి వచ్చిన వారెవరో, స్థానికులు ఎవరో తెలిసే పరిస్థితి ఉండదు. అలాగే చాలా ఏళ్ల క్రితం నుంచి స్థానికంగానే పెళ్లి సంబంధాలు కూడా కుదుర్చుకోవడంతో అంతా ఒక్కటిగానే కలిసి మెలిసి ఉంటున్నారు.

నటనలో ఎదిగి... పాత్రల్లో ఒదిగి...

తెలుగుచిత్ర పరిశ్రమలో గయ్యాళి పాత్ర, అత్త పాత్ర, తల్లి పాత్రల్లో ఇమిడిపోయి ఆ పాత్రలకే ప్రాణం పోసిన మహానటి సూర్యకాంతం. ఆమె పాత్రల్లో కనిపించే గాంభీర్యం, పాత తరం నాటి ముచ్చట్లెన్నో ఆయా సినిమాల్లో కనిపిస్తాయి. ఆమె నటించిన సినిమా పాత్రల వల్ల సూర్యకాంతం అనే పేరు పెట్టుకునేందుకు చాలామంది వెనకడుగు వేసేవారంటే ఆమె వేసిన పాత్రలు ఎంత బలమైన ప్రభావం చూపించాయో అర్థం చేసుకోవచ్చు. అలాంటి సహజ నటి సూర్యకాంతం జన్మించింది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని వెంకటకృష్ణరాయపురంలోనే. ఆమె వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం..



నటనలో ఓ చరిత్ర సూర్యకాంతం
750 చిత్రాల్లో నటించి అనేక పాత్రలకు జీవం పోసిన నటి
కాకినాడ సమీపంలోని వెంకటకృష్ణరాయపురం సొంతూరు.... నేడు ఆమె వర్ధంతి



(ఆంధ్రజ్యోతి-మండపేట)

సూర్యకాంతం కాకినాడ సమీపంలోని వెంకటకృష్ణరాయపురంలో 1924 అక్టోబరు 28న పొన్నాడ వెంకటరత్నమ్మ-అనంతరామయ్య దంపతులకు 14వ సంతానంగా జన్మించారు. సరైన వైద్య సదుపాయాలు లేని కారణంగా పుట్టినవారిలో పది మంది మరణించారు. దీంతో ఈ 14 మందిలో మిగిలింది నలుగురే. వీరిలో చివరి సంతానం సూర్యకాంతం. చిన్నతనం నుంచి సూర్యకాంతం కుటుంబంలో గారాబంగా పెరిగారు. చిన్నతనం నుంచి నటన, సంగీతం మీద ఆసక్తి ఉండేది. పైగా నవలలు అధికంగా చదివేవారు. ఆమె తొలి నుంచి గడసరి. చిన్నతనంలోనే అంటే 8వ తరగతి చదువుతుండగా తండ్రి చనిపోయారు. ఇక పాఠశాలలో వార్షికోత్సవ సందర్భాల్లో సూర్యకాంతం నాటకాల్లో నటించారు. పాటలు పాడటం ఇష్టం. కాకినాడలో బాలాంత్రపు ప్రభాకరరావు హనుమాన్ నాటక మండలి పేరిట కేవలం ఆడపిల్లలతోనే వేసే సతీసక్కుబాయి, చింతామణి, శ్రీకృష్ణతులాభారం వంటి అనేక నాటకాల్లో ఆమె వేషాలు వేశారు. అలా రంగస్థలంలో మంచిపేరు తెచ్చుకున్నారు. 1945లో జెమిని సంస్థ చంద్రలేఖ చిత్రాన్ని భారీ తారాగణంతో తమిళం, హిందీ భాషల్లో నిర్మిం చే సమయంలో నటన మీద ఆసక్తి ఉన్న కళాకారులను, నృత్యకళాకారులను పత్రికాముఖంగా ఆహ్వానించారు. ఆ ప్రకటన చూసిన హనుమాన్‌నాట్యమండలి సభ్యులు దాసరి సుభద్ర, యండమూరి సుభద్ర మద్రాసుకు వెళుతూ సూర్యాకాంతాన్ని కూడా వెంట తీసుకువెళ్లారు. వారితో కలిసి వెళ్లిన సూర్యకాంతం మద్రాసు జెమిని స్టూడియోలో డ్యాన్సర్‌గా నెలవారి జీతానికి చేరి అలా చంద్రలేఖలో సినిమాలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన డ్రమ్‌డాన్స్ సన్నివేశంలో సూర్యకాంతం 500 మందితో కలిసి పాల్గొన్నారు. తొలి నుంచి ఆమెకు హిందీ చిత్రంలో నటించాలనే కోరుకుండేది. జెమిని స్టూడియోలో హిందీ సినిమాలు ఎక్కువగా నిర్మించేవారు. గాయని పి.లీలతో పరిచయమైన సూర్యకాంతం ఆ తర్వాత 1946లో పి.పుల్లయ్య దర్శకత్వం వహించిన నారదనారది చిత్రంలో చిన్నపాత్రలో నటించింది. దాంతో ఆమె జెమిని సంస్థలో నెలవారీ జీతానికి కాంట్రాక్టు వద్ద పనిచేసే సూర్యకాంతం అందులో నుంచి మానేసి 1946లో సారథి స్టూడియో ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో నిర్మించిన గృహప్రవేశం చిత్రంలో మూగ పిల్ల పాత్ర వేసింది. అలాగే 1950లో నిర్మించిన సాధన వారు నిర్మించిన సంసారం చిత్రంలో రేలంగి తల్లిగా నిర్దయ కలిగిన అత్త పాత్రలో తొలిసారి సూర్యకాంతం నటించింది. కేవలం 25 ఏళ్ల వయస్సులో ఆమె 60 ఏళ్ల అత్త పాత్రలో నటించింది. సూర్యకాంతానికి 1950వ సంవత్సరంలో పెద్దిభొట్ల చలపతిరావుతో వివాహం జరిగింది. ఆయన మద్రాసులో న్యాయవాది. ఆయనకు సూర్యకాంతం నాటకాల సమయంలో పరిచయమైంది. 1951లో రాజేశ్వరి ఫిలిమ్స్ కంపెనీ అధినేత, నిర్మాత కేబీ నాగభూషణం నిర్మించిన సౌదామిని చిత్రంలో సూర్యకాంతం హీరోయిన్ పాత్రకు ఎంపికయ్యారు. అప్పటిలో దురదృష్టవశాత్తూ ఆమె కారు ప్రమాదంలో గాయపడడంతో ఆ పాత్రకు వరలక్ష్మిని ఎంపిక చేశారు. ఆ తర్వాత ఎక్కువగా తెలుగు సినిమాల్లో అత్త, తల్లి గయ్యాళి పాత్రలను పోషించారు. పెళ్లిచేసి చూడు, గుండమ్మకథ మాయాబజార్, తోడికోడళ్లు, అప్పుచేసిపప్పు కూడు, వెలుగునీడలు, ఇద్దరు మిత్రులు, ఆత్మబంధువు, కులగోత్రాలు, దాగుడుమూతలు, చిరంజీవులు, కన్యాశుల్కం వంటి చిత్రాల్లో వైవిధ్య పాత్రలను ఆమె పోషించారు. తాము నిర్మించే చిత్రాల్లో సూర్యకాంతం పాత్ర ఉందా లేదా అని నిర్మాతలు దర్శకుడిని అడిగేవారంటే సూర్యకాంతం నటన గురించి అర్థం చేసుకోవచ్చు. సూర్యకాంతం జీవితంలో గుండమ్మకథ చిత్రం ఒక మైలురాయిగా చెప్పవచ్చు. ఆమె సినిమాలో గయ్యాళే తప్ప నిజజీవితంలో దయ, దాణగుణం కలిగి ఉండేది. ఎందరో అనాథ పిల్లలకు, విద్యా సంస్థలకు, అనాథలకు, గ్రంథాలయాలకు ఆర్థికసాయం చేసేది. చిన్నతనంలోనే ఆమె చదువుకు స్వస్తిచెప్పి సినిమాల్లో నటించారు. ఆమె 50 తమిళ చిత్రాల్లో నటించారు. ఐదు భాషల్లో మాట్లాడేది. మొత్తం 750 చిత్రాల్లో నటించారు.

ఆమెకు చివరి దశలో తిరుపతి శ్రీవేంకటేశ్వర మహిళా విశ్వవిద్యాలయం వారు గౌరవ డాక్టరేట్ అందించి సత్కరించారు. ఆమె మంచి వ్యాపారవేత్తగా కూడా రాణించారు. పాత ఇళ్లను కొనుగోలు చేసి వాటిని ఆధునికీకరించి మంచి ధరకు విక్రయించేవారని చెబుతారు. 1993లో ఆమె షుగర్ వ్యాధితో బాధపడుతూ మూత్రపిండాలు దెబ్బతినడంతో 1994 డిసెంబరు 18న మరణించారు. ఆమె తన 70వ ఏట కన్నుమూశారు. ఆమె లేకపోయినా అలనాటి పాతకాలపు సినిమాల్లో వేసిన పాత్రలు నేటికీ సజీవంగానే మనకు కనిపిస్తున్నాయి.



- నేడు మైనార్టీల హక్కుల దినోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, (ఆంధ్రజ్యోతి):

హక్కులు ఉన్నాయి కానీ అమలే జరగడం లేదని మైనార్టీల ఆవేదన ప్రభుత్వాలు పట్టించుకోవాలని వేడుకోలు..

మైనార్టీల్లో ప్రధానమైన ముస్లింలు, క్రిస్టియన్లు, జైనులు, సిక్కులు, పార్శీలు వంటి ఎందరో మన సమాజంలో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం ముస్లింలు, క్రిస్టియన్లు కావడంతో వారి హక్కులకు సంబంధించి ఆయా వర్గాల నుంచి కొన్ని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదనే ఆవేదన వారిలో ఉంది.

మన దేశంలో అత్యధిక సంఖ్యలో హిందువులు ఉన్నారు..మిగిలిన మతాలకు చెందిన వారు మైనార్టీలుగా ఉన్నారు. రాజ్యాంగపరంగా దేశంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నప్పటికీ మైనార్టీల రక్షణకు కొన్ని ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. అయితే మైనార్టీల హక్కులను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే ఆవేదన ఆయా వర్గాల్లో వ్యక్తమవుతోంది.



మా హక్కుల మాటేంటి?

ముస్లింల మాటిది..

ముస్లిం మైనార్టీలకు సంబంధించి వారిని రెండు రకాలుగా చెబుతున్నారు. భాషా పరమైన మైనార్టీలు, మత పరమైన మైనార్టీలుగా ఉన్నారు. ఆర్టికల్ 2 ప్రకారం మైనార్టీల హక్కులకు ప్రాంతీయ, జాతీయ, భాష, రంగు, మతం, ఆస్తి వంటివి ఆధారంగా వివక్ష ఉండకూడదు. అలాగే ఆర్టికల్ 27 ప్రకారం రెలీజియస్ పరంగా మైనార్టీలను రక్షించడానికి ఒక చట్టం ఉంది. కానీ ఇవి అంతంతమాత్రమే తప్ప సరిగా అమలు జరగడం లేదనే అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. దీంతోపాటు మైనార్టీలపై వివక్ష ఎక్కువైందనే భావన ఉంది.. ప్రధానంగా బలహీనమైన ముస్లిం మైనార్టీ వర్గం నూర్ బాషా దూదేకుల వర్గం మరీ వివక్షకు గురవుతోందని ఆ వర్గానికి చెందిన నాయకులు వాపోతున్నారు. ముస్లింలంతా విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణలో సమానత్వం కోరుకుంటున్నారు. దీంతో పాటు కలెక్టర్ ప్రతి నెలా రివ్యూ సమావేశం పెట్టి వారి సాధక బాధకాలు వినాల్సి ఉందని, కానీ కొన్నేళ్లుగా ఇది జరగడంలేదని అంటున్నారు. ప్రభుత్వానికి ముస్లిం సమాజం సమస్యలు తెలియజేయాలి, ఆర్థిక, సామాజిక ఇబ్బందులపై సమీక్ష జరపాలి. ప్రతి నెలా ప్రభుత్వానికి ఒక రిపోర్టు ఇవ్వాలి. దీన్ని పునరుద్ధరించాలి అని ఆయా వర్గాలు కోరుతున్నాయి.

రిజర్వేషన్లు పెంచాలని..

క్రిస్టియన్లలో దళిత క్రిస్టియన్లు బీసీ సీ కేటగిరీలోకి రావడంతో వారికి 1 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తున్నాయి. దీనివల్ల ప్రయోజనం చాలా తక్కువ అనేది వారి భావన. దళిత క్రిస్టియన్లకు బీసీ సీ హోదా ఇవ్వడంతో చాలా మంది విద్య, ఆర్థికపరమైన వాటిల్లో వెనుకబడి ఉంటున్నారని చెబుతున్నారు. దళిత క్రిస్టియన్లకు 5 శాతం వరకూ రిజర్వేషన్లు పెంచితే ప్రయోజనం ఉంటుందని, తమ హక్కులకు రక్షణ లభిస్తుందని భావిస్తున్నారు. గతంలో క్రిస్టియన్ మైనార్టీ వైద్య, విద్యా సంస్థలకు ప్రభుత్వాలు గ్రాంటు ఇచ్చేవి. కొన్నేళ్ల క్రితం గ్రాంట్ ఇన్ ఎయిడ్ పోస్టులు తీసేయడం తమకు ఇబ్బందికరంగా మారిందని వారు చెబుతున్నారు.



5 శాతం రిజర్వేషన్లు పెంచాలి



మైనార్టీ స్కూళ్లలో ఎయిడెడ్ పోస్టులు ఉండేవి. ఇప్పుడు వాటిల్లో పోస్టులను ఎత్తేశారు. మళ్లీ పునరుద్ధరించాలి. దళిత క్రిస్టియన్లకు బీసీ సీ హోదా ఇవ్వడంతో తమ హక్కులకు భంగం వాటిల్లుతోంది. ఐదు శాతం రిజర్వేషన్లు పెంచాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి..

పి.ఎర్నెస్ట్ మోజెస్, పాస్టర్స్ ఫెలోషిప్ రీజియన్ చైర్మన్

సమాన అవకాశాలు కల్పించాలి



ముస్లిం జనాభా దామాషా ప్రకారం ఉపాధి అవకాశాలు కల్పించాలి. విద్యలో ప్రోత్సాహం ఉండాలి. రిజర్వేషన్లు 8 శాతం లేదా 10 శాతం పెంచి సమాన అవకాశాలు కల్పించాలి. ఇస్లామిక్ బ్యాంకులు పెట్టాలి. వడ్డీలు లేని రుణాలు అందజేయాలి. **షేక్ సుభాన్, నూర్ బాషా సంఘం**



సామర్లకోటలో టిడ్కో లబ్ధిదారులతో మాట్లాడుతున్న చైర్మన్ అజయ్‌కుమార్

'టిడ్కో గృహాలను నిర్లక్ష్యం చేసిన వైసీపీ'

పెద్దాపురం/సామర్లకోట డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం శివారు వాలుతిమ్మాపురం సమీపంలో నిర్మించిన టిడ్కో గృహాలను, సామర్లకోటలోని గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ టిడ్కో గృహాలను గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా నిర్వీర్యం చేసిందన్నారు. లబ్ధిదారులకు, బ్యాంకర్లకు మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నట్టు పేర్కొన్నారు. టిడ్కో గృహాల్లో నివాసముంటున్న ప్రజల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. టిడ్కో గృహాలు నివాస యోగ్యంగా ఉన్నాయా లేదా అనేదానిపై సాంకేతిక నిపుణుల బృందంతో కమిటీని వేశామన్నారు. గృహ సముదాయల వద్ద పూర్తిస్థాయిలో అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పలువురు కాలనీ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసురావడంతో వాటిని సాధ్యమైనంత తొందర్లో పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో 'కౌడా' చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడ్కో అధికారులు పాల్గొన్నారు.



మోతుగూడెంలో ఉదయం తొమ్మిది గంటలైనా వీడని మంచు



చలి మంట కాగుతున్న గిరిజనులు

మంచు దుప్పటి...

మోతుగూడెం/రాజవొమ్మంగి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పలు గ్రామాలను పొగ మంచు దట్టంగా కమ్మేసింది. చింతూరు మండలం మోతుగూడెంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల వరకు భానుడు కనిపించలేదు. దీంతో వాహనచోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు. చలి తీవ్రతకు గిరిజనులు వణుకుతున్నారు. మంట వేసుకుని చలి నుంచి రక్షణ పొందుతున్నారు. మరోవైపు రాజవొమ్మంగిలోనూ మంచుదుప్పటి పరుచుకుంది. శివాలయం కొండపై నుంచి చూస్తే గ్రామం మొత్తం మంచు తెరల్లో ఉన్నట్టు కనిపించింది.

రాళ్లకట్టు... జారేట్టు!

సామన్యుడైనా, సంపన్నుడైనా... అధికారి అయినా, ప్రజాప్రతినిధి అయినా.... ఎవరైతే నాకేంటి అంటూ వెక్కిరిస్తోంది ఈ గొయ్యి. కాకినాడ జిల్లా రౌతులపూడి శివారు రాళ్లకట్టు సమీపంలో ఉంది ఇది. ఐదు రోజుల క్రితం ఓ స్కూలు బస్సు, రెండు రోజుల క్రితం ఒక ఆటో ఇదే ప్రదేశంలో తిరగబడ్డాయి. మంగళవారం రౌతులపూడి మండలంలోని ఉప్పంపాలెంలో రెవెన్యూ సదస్సుకు వెళ్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు వాహనం కూడా ఈ గోతిలో దిగబడిపోయింది. కొందరు వ్యక్తులు దిగి తోశారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి)



పోలీసులపై ఎటాక్ చేసిన

దొంగ నోట్ల ముఠా అరెస్టు

- పోలీసుల అదుపులో 13 మంది
- నిందితులు రాజమహేంద్రవరం, భీమవరం వాసులే
- పరారీలో ఐదుగురు
- స్విఫ్ట్ కారు, నాలుగు బైక్‌లు స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తప్పించుకుందామని పోలీసులపై ఎటాక్ చేస్తే అసలు డొంక కదిలింది.. భీమవరం కేంద్రంగా సాగుతున్న పెద్ద దొంగ నోట్ల ముఠా బయటపడింది. రాజమహేంద్రవరంలో ఈ నెల 12న అర్ధరాత్రి శ్రీకాకుళం పోలీసులపై ఎటాక్ చేసి దొంగ నోట్ల కేసులో నిందితుడు రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని తీసుకు పోయారు. ఈ సంఘటన సంచలనంగా మారింది. పోలీసులపై ఎటాక్ చేసి నిందితుడిని ఎత్తుకుపోవడంపై ఆశ్చర్యానికి లోనయ్యారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. మొత్తం 18 మంది పోలీసులపై ఎటాక్ చేసి అదుపులో ఉన్న నిందితుడిని ఎత్తుకుపోయినట్టు గుర్తించారు. అనంతరం తీగలాగితే దొంగనోట్ల ముఠా గుట్టు బయటపడింది. వారిలో 13 మందిని ప్రకాష్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజమహేంద్రవరం మహిళా పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం విలేకరులకు అడిషనల్ ఎస్పీ అల్లూరి వెంకట సుబ్బరాజు, సెంట్రల్ జోన్ డీఎస్పీ కే.రమేష్ బాబు, ప్రకాష్‌నగర్ సీఐ బాజిలాల్ వివరాలు వెల్లడించారు.

అసలు ఏం జరిగిందంటే...

శ్రీకాకుళం జిల్లా సిగడం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో నిందితుడిగా ఉన్న రాపాక ప్రభాకర్ అలియాస్ ప్రతాప్ రెడ్డిని ఈనెల 12న రాత్రి పోలీసులు భీమవరంలో అరెస్టు చేశారు. ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న కృష్ణమూర్తి కోసం రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సెల్‌టవర్ లోకేషన్ వెరిఫై చేయడానికి వచ్చారు. శ్రీకాకుళం పోలీసులు ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌కి వచ్చి తిరిగి ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోతుండగా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు వీఎల్‌పురం సర్కిల్ లిమిట్స్‌లో కొంతమంది రెండు కార్లు, నాలుగు బైక్‌లపై వచ్చి పోలీసులపై ఎటాక్ చేసి రాపాక ప్రభాకర్‌ను తీసుకుని వెళ్లిపోయారు. దీనిపై అదే రోజు రాత్రి ప్రకాష్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ బాజీలాల్ కేసు నమోదు చేశారు. పోలీస్‌లపై ఎటాక్ చేసిన ముఠా ఆచూకీ కోసం ఆరు బృందాలను రంగంలోకి దింపి విస్తృతంగా గాలించారు. ఎటాక్ చేసినవారంతా దొంగనోట్ల ముఠాకు చెందిన వారని గుర్తించి అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం దెయ్యాలతిప్పకు చెందిన నల్లి శశికాంత్, బ్రిడ్జిపేట గునుపూడికి చెందిన పోతుల యాపేతు అలియాస్ వినోద్, గునుపూడి అంబేడ్కర్ నగర్‌కు చెందిన తాళ్ళ జాన్సన్ రాజు, బ్రిడ్జిపేటకు చెందిన పెద్దపాటి మహంకాళి, నేతపూడి క్రాంతి కుమార్, మొగల్తూరు మండలం కవురు వారిపాలెం అంబేడ్కర్ కాలనీకి చెందిన గండుపల్లి కామరాజు, రాజమహేంద్రవరం నెహ్రూనగర్‌కు చెందిన గెద్దాడ శ్రీనాథ్, వై.జంక్షన్ సుబ్బారావు పేటకు చెందిన తురుబిల్లి రామసతీష్, తాడితోటకు చెందిన బుంగా తేజ అలియాస్ ఏలియా, గాంధీపురానికి చెందిన ఇడిసిమళ్ళ సతీష్, ఏవీఏ రోడ్డుకు చెందిన బాలుడు, బుచ్చియ్యపేటకు చెందిన పీతల చిరంజీవి, లక్ష్మీవారపుపేటకు చెందిన నక్కా వెంకట దుర్గా శ్రీఅఖిల్‌లను అరెస్టు చేశామన్నారు. వారితో పాటు స్విఫ్ట్ కారు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారని చెప్పారు. చాలాకాలంగా వారంతా ముఠాగా ఏర్పడి దొంగ నోట్లు మారుస్తున్నట్టు సమాచారం. దీనిలో భాగంగా భీమవరంలో ప్రధాన నిందితుడు ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకున్న వెంటనే అటు భీమవరం ముఠా.. ఇటు రాజమహేంద్రవరం ముఠా రంగంలోకి దిగి నిందితుడిని తీసుకెళ్లిపోయారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్ బాబు పర్యవేక్షణలో కేసును ఛేదించిన సీఐ బాజీలాల్, ఎస్ఐ శివప్రసాద్, హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్. వెంకట్రావు, సీహెచ్.శ్రీనివాసరావు, క్రైమ్ కానిస్టేబుల్ ఎస్.వీరబాబు, వి.నాగరాజు, టీ.వరహాల బాబు, బి.రాజబాబును ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారని అడిషనల్ ఎస్పీ తెలిపారు.

ఆరుగురు రాజమహేంద్రవరం వారే...

దొంగ నోట్ల ముఠా కేసులో నిందితుడిని తప్పించేందుకు శ్రీకాకుళం పోలీస్‌లపై ఎటాక్ చేసిన వారిలో ఆరుగురు రాజమహేంద్రవరానికి చెందిన వారే కావడం విస్మయానికి గురిచేస్తుంది. వారంతా 19 నుంచి 32 ఏళ్ల వారే.

కొట్టి... చీరతో చేతులు కట్టి!

దూబచర్లలో దోపిడీ దొంగల బీభత్సం

24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు చోరీ

నల్లజర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లలో మంగళవారం తెల్లవారుజామున దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించి 24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు దోచుకెళ్లారు. స్థానికుల వివరాల ప్రకారం.. దూబచర్ల గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాధికారి చీమకుర్తి వీరభద్ర అప్పల కృష్ణమూర్తి తన భార్య లక్ష్మీకుమారితో కలిసి పాత ఇండియన్ బ్యాంకు ఉన్న ఇంట్లో జీవిస్తున్నారు. లక్ష్మీకుమారి అనారోగ్యంతో మంచంపైనే ఉంటున్నారు. ఆమెకు సహాయకురాలిగా అదే గ్రామానికి చెందిన జుత్తింగ పెద్దింట్లను నియమించుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కృష్ణమూర్తి ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడే ఉన్న పెద్దింట్ల.. ఎవరు అంటూ ప్రశ్నించే లోగా ఆమెను కొట్టి చీరతో చేతులు కట్టేశారు. ఆపై కృష్ణమూర్తి చేతులను సైతం తాళ్లతో కట్టి బంధించి లక్ష్మీకుమారి మెడలో బంగారు ఆభరణాలతోపాటు బీరువా పగులగొట్టి ఆభరణాలు, రూ.30 వేల నగదు దోచుకుని వెళ్లిపోయారు. సంఘటన నుంచి తేరుకున్న కృష్ణమూర్తి 112కి కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ దేవకుమార్, దేవరపల్లి సీఐ బీఎన్ నాయక్, ఎస్ఐ సోమరాజు, రమేష్, బాలాజీ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వేలిముద్రలు సేకరించి, డ్యాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సుబ్బరాజు


అనారోగ్యంతో మంచంపై ఉన్న లక్ష్మీకుమారి

కాపురానికి రానివ్వకుండా వేధింపులు

భర్త ఇంటి ముందు మహిళ నిరసన దీక్ష


కొమరాజులంకలో దీక్ష చేపట్టిన బాధితురాలు

రావులపాలెం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న తరుణంలో అత్తింటి వారు కాపురానికి రానివ్వకుండా వేధిస్తున్నారని తమకు న్యాయం చేయాలంటూ ఓ వివాహిత భర్త ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. యువతి, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం కొమరాజులంకకు చెందిన గంగ్రోతు హరికృష్ణ, యామన ఝాన్సీ 6 నెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అత్తారింటికి వెళ్లగా అత్త గంగ్రోతు వెంకటలక్ష్మి, మావయ్య సత్తిపండులు ఝాన్సీ మెడలో తాళి తెంపి మీది వేరే కులం, మాది వేరే కులం నువ్వు కాపురానికి ఎలా వస్తావంటూ కొట్టి దుర్భాషలాడారు. దీంతో మనస్తాపానికి చెందిన బాధితురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమెను స్థానిక ప్రవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడింది. కాగా కాపురానికి తీసుకుని వెళ్లాలని ఎన్నిసార్లు వేడుకున్నా, పెద్ద మనుషులతో మాట్లాడించినా ఎటు వంటి స్పందన లేకపోవడంతో ఝాన్సీ తనకు న్యాయం చేయాలంటూ మంగళవారం భర్త గంగ్రోతు హరికృష్ణ ఇంటి ముందు నిరసన దీక్ష చేపట్టింది. తనకు న్యాయం జరిగే వరకూ దీక్ష కొనసాగిస్తానని పేర్కొంది. బాధితురాలికి అండగా పలువురు మహిళలు చేరుకుని ఝాన్సీని కాపురానికి తీసుకుని వెళ్లాలంటూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ చంటి సిబ్బందితో అక్కడికి వెళ్లి వారితో చర్చించారు. తనకు న్యాయం జరగాలని శాంతియుతంగా దీక్ష చేస్తున్నానని న్యాయం జరిగే వరకూ కొనసాగిస్తానని ఝాన్సీ తెలిపింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

న్యాయం జరిగే వరకూ పోరాటం

బాధితురాలకు అన్ని విధాలా న్యాయం జరిగే వరకూ అండగా నిలబడి పోరాడతామని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు మట్టా వీరబాబుగౌడ్ అన్నారు. బాధితురాలి దీక్ష వద్దకు ఆయన చేరుకని అండగా నిలబడ్డారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గంగ్రోతు హరికృష్ణ ఝాన్సీని పెళ్లి చేసుకుని కాపురానికి తీసుసుకెళ్లకపోవడం దారుణమన్నారు. అత్తమామలు ఆమెపై చేసిన దాడిని ఖండిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ దృష్టికి విషయాన్ని తీసుకుని న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

కడియం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): తన భార్యను కత్తితో నరికి, ఆమెతో సన్నిహితంగా ఉన్న వ్యక్తిని నరికి చంపిన కేసులో తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరితోటకు చెందిన పితాని సత్యనారాయణకు సెక్షన్ 302 కింద జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా, సెక్షన్ 307 కింద 7 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు సెషన్ జడ్జి ఎం.మాధురి తీర్పునిచ్చారు. సీఐ ఎ.వెంకటేశ్వరరావు వివరాల ప్రకారం.. వేమగిరి తోటకు చెందిన పితాని సత్యనారాయణ తన భార్య భవానీ అదే గ్రామానికి చెందిన బొంతు వెంకన్నతో కలిసి ఉండడాన్ని చూసి వివాహేతర సంబంధం ఉందని భావించి ఇద్దరినీ కత్తితో నరికాడు. వెంకన్న అక్కడికక్కడే మరణించగా భవానీకి గాయమైంది. వెంకన్న సోదరుడి ఫిర్యాదుతో అప్పటి సీఐ కె.శ్రీధర్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా వాదోపవాదాల అనంతరం జడ్జి ఎం.మాధురి నిందితుడికి సెక్షన్ 302 కింద జీవితఖైదు, రూ.10 వేల జరిమానా, సెక్షన్ 307 కింద ఏడేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 9 నెలలు జైలుశిక్ష విధించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున ఏపీపీ వీవీఎస్‌బీ రాజు వాదనలు వినిపించారు.

దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన

ఫీల్డ్ అసిస్టెంట్‌కు 14 రోజుల రిమాండ్

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలిపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి కాకినాడ కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ 14రోజుల రిమాండ్ విధించినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం వేములవాడకు చెందిన దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మట్టపర్తి వీరబాబు ఈనెల 11న రాత్రి అత్యాచారయత్నం చేసి పరారైన విషయం పాఠకులకు తెలిసిందే. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కరప పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపరచగా మెజిస్ట్రేట్ ఆదేశాలతో సబ్‌జైలుకు తరలించారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో

సత్తా చాటిన నాగబాబు

3 బంగారు పతకాలను సాధించిన కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారి


3 బంగారు పతకాలు, సర్టిఫికెట్లతో నాగబాబు

కరప, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 44వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో కాకినాడ జిల్లా కరప సబ్‌యూనిట్ మలేరియా అధికారి యాతం నాగబాబు సత్తా చాటి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. గుడివాడ ఎన్టీఆర్ స్పోర్ట్స్ స్టేడియంలో ఈనెల 14నుంచి రెండు రోజుల పాటు పరుగు పందెం పోటీలు జరిగాయి. 200మీటర్లు, 400మీటర్లు, 800మీటర్లు పరుగుపందెంలో వరుసగా మొదటి స్థానాలు సాధించి బంగారు పతకాలను గెలుచుకున్నారు. ఈ క్రమంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్‌లోని ఆళ్వార్ వద్ద జరిగే 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు నాగబాబు ఎంపికయ్యారు. 2013 నుంచి ఇప్పటివరకు జరిగిన వివిధ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ పరుగుపందాల్లో పలు కేటగిరీల నుంచి 60 పతకాలను సాధించినట్టు మంగళవారం ఆయన విలేకరులకు తెలిపారు. అనంతరం కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాదపూర్వకంగా కలిసి తాను సాధించిన బంగారు పతకాలను, సర్టిఫికెట్లను చూపించారు. నాగబాబును ఎమ్మెల్యే కొనియాడి అభినందనలుతెలిపారు.

ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు

‘నన్నయ’ విద్యార్థి వెంకటరమణ ఎంపిక


వెంకటరమణను అభినందిస్తున్న అధ్యాపకులు

దివాన్‌చెరువు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో వచ్చే నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థి ఎస్.వెంకటరమణ ఎంపికైనట్టు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రమణను వీసీ సన్మానించి వివరాలు తెలిపారు. నన్నయ వర్సిటీలో జరిగిన ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరంలో ఎంపికైన రమణ పదిరోజులు పూణేలో జరిగిన ప్రీఆర్‌డీలో చక్కటి ప్రతిభ కనబరచి గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఎంపికైనట్టు చెప్పారు. మన రాష్ట్రం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాగా వారిలో నన్నయ వర్సిటీ విద్యార్థి వెంకటరమణ ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కార్యక్రమ కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం అధికారి ఎం.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్ - 2 ఫార్మసిస్ట్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల పరిధిలోని మెడికల్ అండ్ హెల్త్ జోన్ - 2 పరిధిలోని కాంట్రాక్టు గ్రేడ్ - 2 ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించిన రివైజ్డ్ ప్రొవిజనల్ మెరిట్ లిస్టును మంగళవారం విడుదల చేశారు. ఈ మేరకు రీజనల్ డైరెక్టర్ పద్మా శశిధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. లిస్టు జిల్లా ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందని తెలిపారు. మెరిట్ లిస్టుకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు, ఫిర్యాదులను ఈనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా తెలియజేయాలని సూచించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

ఐదుగురికి గాయాలు

తేటగుంట హైవేపై ఘటన

తుని రూరల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట సమీపంలో 16వ నెంబరు జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటన ఉలికిపాటుకు గురిచేసింది. కాకినాడ జిల్లాలో ఓ ట్రావెల్ బస్సు నిర్వాహకుడు కాశీ యాత్ర కోసం ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరారు. అన్నవరం దేవస్థానం వద్ద దర్శనం అనంతరం సింహాచలం వెళ్లేందుకు పయమై ఐదుకిలోమీటర్లు వెళ్లేసరికి ప్రమాదం జరిగింది. తేటగుంట వద్ద లారీ ఎదురుగా ఉన్న హైవే వ్యాన్‌ని ఢీకొనగా అదే లారీని టూరిస్ట్ బస్సు వెనుక నుంచి ఢీకొంది. భారీ శబ్దంతో పాటు కేకలు వినిపించడంతో స్థానికులు గుమిగూడారు. అప్పటికే బస్సులో చెల్లాచెదురుగా పడి ఉన్న ప్రయాణికులను ఎమర్జెన్సీ విండో ద్వారా బయటకు తీసుకొచ్చేందుకు పోలీసులు, హైవే మెయిన్ సిబ్బంది శ్రమించారు. బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా ఐదుగురికి గాయాలవగా మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వెంకట్రావు, హేమా, సత్యవతి, శ్రీరాములు, పార్వతిలను హైవే అంబులెన్స్ సహాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించి పోలీసులు వైద్యం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు తెలిపారు.


బస్సులో ఇరుక్కున్నవారిని బయటకుతీస్తున్న దృశ్యం


గాయాలపాలైన ప్రయాణికులు

శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్‌లో

కొనసాగుతున్న ఐటీ దాడులు

పెద్దాపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీలలితా రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో ఐటీ సోదాలు కొనసాగుతున్నాయి. సుమారు 4రోజులుగా ఈ దాడులను ఐటీ అధికారులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఫ్యాక్టరీ, ఇళ్లు బంధువుల ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారి ఆస్తులపై తనిఖీలు చేపట్టారు. పలు కీలక పత్రాలు, ఫైళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. అలాగే కంపెనీకి సంబంధించిన ఆడిటర్లు, లీగల్ అడ్వైజర్లు, దస్తావేజు లేఖర్లను విచారించినట్లు తెలిసింది. అర్ధరాత్రి వరకూ ఐటీ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇటీవల యాజమాన్యం భారీగా పలు ప్రాంతాల్లో భూములు, వాణిజ్య స్థలాలు కొనుగోలు చేసినట్లు ఐటీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. దీంతో అందుకు సంబంధించిన డాక్యు మెంట్లు, భూముల విలువ తదితర వివరాలను ఆరాతీస్తున్నట్టు తెలుస్తోంది. బ్యాంకు లాకర్లను సైతం తనిఖీ చేసినట్టు సమాచారం. ఐటీ అధికారులు ఇప్పటివరకూ ఎంతమేర తనిఖీలు చేశారు, ఎంత మొత్తంలో నగదు, బంగారు గుర్తించారు. లెక్కల్లో లేని డబ్బు ఎంత గుర్తిం చారు అనే విషయాలు మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. ఇన్ని రోజులుగా ఐటీ సోదాలు జరగడంతో పెద్దాపురం పట్టణంలో ఇదే విషయం చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉండగా భారీగా బంగారం, లెక్కల్లో లేని నగదును ఐటీ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. లెక్కల్లో పలు వ్యత్యాసాలను గుర్తించినట్లు సమాచారం. దానికి సంబంధించిన వివరాలను ఐటీ అధికారులు ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది. ఎంత మేర బంగారం కొనుగోలు చేశారు..? ఎక్కడ కొనుగోలు చేశారు..? అనే విషయంపై సంబంధిత దుకాణాలను సైతం విచారణ చేయనున్నట్లు సమాచారం. శ్రీలలితా యాజమాన్యానికి సంబంధించిన గృహాల్లో నివాసం ఉంటున్న వారిని ఫ్యాక్టరీకి పిలిచి విచారించినట్లు తెలుస్తోంది. అలాగే ఈ దాడులు మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉన్నట్టు సమాచారం.

‘పదోన్నతుల సీనియారిటీ లిస్టును వెబ్‌సైట్‌లో పొందుపరిచాం’

కాకినాడ రూరల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పరిధిలో గల మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల సీనియారిటీ లిస్టును **deoeg.org** వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు కాకినాడ జిల్లా డీఈవో పి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే సదరు అభ్యర్థులు కాకినాడ డీఈవో కార్యాలయంలో బుధవారం ఉదయం 11గంటలలోపు సమర్పించాలని ఆయన చెప్పారు.

జేఎన్టీయూకేలో అంతర్గత బదిలీలు

జేఎన్టీయూకే, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): వర్శిటీ ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జేఎన్టీయూకేలోని పలువురు అధికారులకు అంతర్గత బదిలీలు చేస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్ మంగళవారం ఉత్తర్వులు జారీచేయగా వీసీ సమావేశహాల్లో వారందరికీ వీసీ నియామక ఉత్తర్వులను అందజేశారు. స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ విభాగాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ మాలోతు రమేష్‌ను స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ప్రొఫెసర్ కె.పద్మప్రియను స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ఏఎం ప్రసాద్‌ను ఐఎస్‌టీ, కె.రామును అడ్మిషన్స్ విభాగాల ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమించారు. ప్రొఫెసర్ డి.కోటేశ్వరరావును బీటెక్ అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సు బీవోఎస్ ఛైర్మన్‌గా, ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బీటీ కృష్ణను ఎంటెక్ వీఎల్ఎస్ఐ ప్రోగ్రామ్ బీవోఎస్ ఛైర్మన్‌గా నియమిస్తూ సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారిని వీసీ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

19, 20న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు

పిఠాపురం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 19,20వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు జరగనున్నాయి. జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 100మందికి పైగా బాక్సర్లు, మరో 50మంది కోచ్‌లు, టీమ్ మేనేజర్లు, టెక్నికల్ స్టాఫ్ హాజరుకానున్నారు. ప్రతిభ కనబరిచే బాక్సర్లను జనవరిలో ఉత్తరప్రదేశ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని.. బాక్సర్లు, సహాయకులకు భోజన, వసతి ఏర్పాట్లు చేసినట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మణరావు తెలిపారు.

ఏపీఎస్పీలో హోరాహోరీగా స్పోర్ట్స్‌మీట్

సర్పవరం జంక్షన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో గత 2రోజులుగా నిర్వహిస్తున్న యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మంగళవారం షార్ట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, హైజంప్, 200 మీటర్స్, 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో రెట్టించిన ఉత్సాహంలో ఏపీఎస్పీ పోలీసులు పాల్గొన్నారు. 800 మీటర్ల పరుగు పందెం, 1500 మీటర్ల పరుగు పందెం (పురుషులు), క్రికెట్ పోటీలు, కబడ్డీ, టెన్నిస్ డబుల్స్ మహిళలు లెమన్ స్పూన్, టెన్నీకాయిట్ పోటీలు, త్రో బాలింగ్, మ్యూజికల్ ఛైర్స్ తదితర పోటీలు నిర్వహించగా ఏపీఎస్పీ బెటాలియన్ పోలీసులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. బుధవారం మూడోరోజు ముగింపు క్రీడలు జరుగుతాయని పోలీసులు తెలిపారు.


కబడ్డీ పోటీలో తలపడుతున్న పోలీసులు


లెమన్ స్పూన్ పోటీలో పాల్గొన్న మహిళలు

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

21న కొవ్వూరులో మెగా జాబ్‌మేళా


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్ జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికాస ఆధ్వర్యంలో కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జాబ్‌మేళా ఏర్పాటు చేశామని, టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటీ, ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్ వంటి వివిధ రకాల విభాగాల్లో 28 కంపెనీల్లో సుమారు 1500 ఉద్యోగాల కల్పనకు ముం దుకు వచ్చాయన్నారు. ఆసక్తి యువత ఉదయం 9 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. యువతకు ఉద్యోగవకాశాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు కలెక్టర్ చెప్పారు. యువతీయువకులు నైపుణ్యాభివృద్ధి కోసం నాక్ సంస్థను గాని, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్‌ను గాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చరావు, మేనేజర్ శర్మ, బాబు పాల్గొన్నారు.

సమష్టి భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

శిక్షణా తరగతుల్లో ఎమ్మెల్యే బత్తుల


రాజానగరంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. సుస్థిరమైన, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులు పాటు ఏర్పాటు చేసిన మండల స్థాయి శిక్షణా తరగతులను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. పల్లెసీమలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక నిధులు కేటాయిస్తూ, అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. రీసోర్స్‌పర్సన్లుగా ఎంపీడీవో జేపీ ఝాన్సీ, ఈవోపీఆర్డీ ఎస్‌వీవీఎస్ఎన్ లక్ష్మి(వాణి), ఏవో సుబ్రహ్మణ్యం, హనుమంతరావు వ్యవహరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ సంపత్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి, సెర్ప్ ఏపీఎం సునీత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాయిబాబా ఆధ్వర్యంలో మండలంలో ఉన్న అన్ని గ్రామాల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, ఎల్ఎస్‌డీజీ శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ వేపకాయల రాంబాబు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, ఎంపీడీవో సాయిబాబు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

పాతతుంగపాడు రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రశాంతి


పాతతుంగపాడు రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

దివాన్‌చెరువు, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో స్వీకరించిన అర్జీలకు జవాబుదారీతనంతో కూడిన పరిష్కారం ముఖ్యఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మండలంలోని రాఘేయపాలెం, పాతతుంగపాడు, కొత్తతుంగపాడు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. పాతతుంగపాడులో జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు భూసంబంధిత అంశాలపై ఎన్నో అర్జీలు ఇస్తున్నారని, ప్రతీ సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌లో జిల్లా వ్యాప్తంగా ప్రజలు జిల్లా కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు ఇచ్చి పరిష్కారం కోరుతున్నారన్నారు. వీటికి శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు రెవెన్యూ శాఖాధికారులు హాజరై వాటి పరిష్కార మార్గం చూపుతున్నారన్నారు. ఈ సదస్సుల్లో వస్తున్న ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ పోర్టల్‌లో అప్లోడ్ చేసి అధికారులకు జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. మంగళవారం నాలుగు అర్జీలు వచ్చాయని, వాటికి గురించి మాట్లాడుతూ వాటికి సహేతుకమైన పరిష్కారం కోసం గతంలో గ్రామ పంచాయితీలో జరిగిన తీర్మానం రికార్డ్ కాపీ ఉంటే సమస్యకు పరిష్కారం అవుతుందన్నారు. రెవెన్యూ సదస్సుల సమయంలో పరిశీలనకు అందుబాటులో రికార్డులు ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, తహశీల్దార్ ఎన్.లక్ష్మీలావణ్య ఉన్నారు.

రంగంపేట: మండలంలోని వడిశలేరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ కలెక్టర్ ఎం.మాధురి విచ్చేసి మాట్లాడారు. రెవెన్యూ సదస్సుకు వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేయాలన్నారు. పోతుల చిట్టియ్య అనే రైతుకు పాస్‌బుక్ కోసం దరఖాస్తు చేయాలని, పెండ్యాల రాంబాబుకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం రిజిస్ట్రార్ కార్యాలయానికి సిఫార్సు చేశారు. కాగా రెవెన్యూ సదస్సుకు 55 అర్జీలు వచ్చాయని తహసీల్దారు అనసూయ తెలిపారు. మ్యూటేషన్ 31, భూసర్వే 18, 22ఏ నుంచి తొలగించాలని 3, పంటకాల్వ పూడికతీత తీయాలని 1, రిజిస్ట్రేషన్ కార్యాలయానికి సంబంధించి 2 అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు ఎం.పద్దయ్య, టి.అశ్విని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కడియం: మురమండలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దారు పోశిబాబు మాట్లాడుతూ గతంలో జరిగిన భూసర్వేలో లోపాలుంటే దరఖాస్తు చేసుకుని రైతులు సమస్యను పరిష్కరించుకునే అవకాశం అన్నారు. ఈ సందర్భంగా భూసర్వేకి సంబంధించి 12 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దారు పోశిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి, ఎంపీటీసీ మెల్లిమి మంగ, కూటమి నాయకులు ప్రత్తిపాటి రామారావుచౌదరి, దేవళ్ల రామ్మోహనరావు, వట్టికూటి జానకీరామ్, నందమూరి సూరిబాబు, వీఆర్‌వో గన్నెమ్మ, రైతులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వెబ్‌సైట్ ఉద్భవ్ - 2025

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఉద్భవ్-2025 పేరుతో అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించింది. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మంగళవారం దీన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు కళాశాల అన్ని కార్యక్రమాలకు కేంద్ర వేదికగా నిలుస్తుందన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్‌లో
భవ్యశ్రీకి రెండు స్వర్ణాలు

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మైసూరులో ఈనెల 5 నుంచి 15వ తేదీ వరకూ జరిగిన రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఎస్ఎఫ్ఐ) జాతీయస్థాయి స్పీడ్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన చిన్నారి కెల్లా భవ్యశ్రీ రెండు స్వర్ణ పతకాలు సొంతం చేసుకుంది. ఈ పోటీలకు రాజమహేంద్రవరం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా వీరిలో భవ్యశ్రీ అండర్ 11-14 కేటగిరీలో రింక్ 7, రోడ్ 3 (100 మీటర్లు)లో పాల్గొని స్వర్ణాలు సాధించింది. స్వర్ణ పతకాలు సాధించిన భవ్యశ్రీని, దానవాయిపేట గాంధీ పార్కు కోచ్ రామును పలువురు అభినందించారు.

పెన్షన్..ఉద్యోగుల ప్రాథమిక హక్కు

▸ రాజమహేంద్రవరం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంజీవరావు
▸ ఘనంగా పెన్షనర్స్ డే


కోరుకొండలో 75 ఏళ్లు పూర్తి చేసుకున్న పెన్షనర్లను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): పెన్షన్ అనేది ఉద్యోగులకిచ్చే భిక్ష కాదని.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం ఉద్యోగుల ప్రాథమిక హక్కని, సుప్రీం కోర్టులో వాదించి నేటి లిబరలైజ్డ్ పెన్షన్ రూల్స్ తెచ్చిన మహావ్యక్తి నకరా అని రాజమహేంద్రవరం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేకే సంజీవరావు అన్నారు. డిస్ట్రిక్ట్ ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలోని పెన్షనర్స్ బిల్డింగ్ స్థలంలో మంగళవారం అంతర్జాతీయ పెన్షనర్స్ దినోత్సవం నిర్వహించారు. 70 ఏళ్లు నిండిన 80 మంది పెన్షనర్లను సన్మానించారు. మోరంపూడి వద్ద గల ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద ఎల్ఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.రఘునాథరావు జాతీయ పెన్షనర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో డీటీవో ఎన్.సత్యనారాయణ,కె.పూజావిహారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ఎం భాను, జిల్లా కార్యదర్శి ఎం.పార్వతి, నగర ఎన్జీవో కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సీవీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: అనపర్తిలో పెన్షనర్ల కార్యాలయంలో జరిగిన పెన్షనర్స్ డే కార్యక్రమానికి సబ్ ట్రెజరీ అధికారిణి దాక్షాయణి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముందుగా ఆమె పెన్షనర్స్ అసోసియేషన్ జెండాను ఆవిష్కరించి పెన్షనర్లకు శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్ నకరా కృషి వల్లే నేటి సమాజంలో అనేక మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ తరువాత పెన్షన్ పొంది గౌరవంగా జీవిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పలువురు పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. పెన్షనర్ల అసోసియేషన్ అనపర్తి అధ్యక్షుడు పీవీఎస్ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుజాత, సీనియర్ అకౌంటెంట్ శివఅప్పారావు, జీబీఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎస్‌వీ గంగరాజు, చాగంటి సుబ్రహ్మణ్యం, తాడి గణపతిరామారెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి, ఎస్‌వీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ పంచాయతీ ఆవరణలోని పెన్షనర్స్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న 9 మంది విశ్రాంతి ఉద్యోగులను సత్కరించారు. విశ్రాంతి ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నేటి సమాజంలో విశ్రాంతి ఉద్యోగులు గౌరవమైన జీవనం సాగించడానికి దివంగత డీఎస్ నకరా తీసుకొచ్చిన సుప్రీంకోర్టు ఉత్తర్వులే కారణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, సబ్‌ట్రెజరీ అధికారిణి ఆర్.రజనీ, వాకా నరసింహారావు, కర్రి వీరగణేష్, బత్తుల ప్రభుదాసు, ఎస్ఎల్ఎన్ హర్యామర్, పుల్లెపు నాగేశ్వరరావు, కె.రవికుమార్, వి.భూపతిరావు పాల్గొన్నారు.

అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ
చైర్మన్‌గా సుధాకరరెడ్డి

అనపర్తి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనపర్తి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా అనపర్తి నీటి సంఘం అధ్యక్షుడు తమలంపూడి సుధాకరరెడ్డి ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారిణి ఎం.మాధురి ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు చైర్మన్ అభ్యర్థి నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. చైర్మన్ పదవికి తమలంపూడి సుధాకరరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం వైఎస్ చైర్మన్ పదవికి స్వీకరించిన నామినేషన్లలో జి.మేడపాడు నీటి సంఘం అధ్యక్షుడు కృష్ణమూర్తి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక కూడా ఏకగ్రీవమైనట్టు ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధాకరరెడ్డి, కృష్ణమూర్తిలను కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, పల్లె శ్రీనివాసరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, కర్రి బులిరెడ్డి, సర్పంచ్ తేతల సుధాకరరెడ్డి అభినందించారు.

ఒకటి జనసేనకు, మరొకటి టీడీపీకి

కోరుకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుష్కర ఎత్తిపోతల పథకానికి సంబంధించి మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగింది. 7గ్రామాల నుంచి ఎన్నికైన పుష్కర ఎత్తిపోతల పథకం సాగునీటి సంఘాల అధ్యక్షులు కోరుకొండ డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో జనసేన పార్టీకి చెందిన గాదరాడ, కల్వచర్ల సాగునీటి సంఘాలకు చెందిన అధ్యక్షుడు అడబాల వీరవెంకట సత్యనారాయణను చైర్మన్‌గా ఎన్నుకోగా కోటికేశవరం సాగునీటి సంఘం అధ్యక్షుడు అడపా వీరబాబును వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. వీరి ఎన్నికను ఎన్నికల అధికారి ధ్రువీకరిస్తూ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, జనసేన నాయకులు అడ్డాల శివ మేడిశెట్టి శివరాం సత్కరించారు. అలాగే జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ.. చైర్మన్ సత్యనారాయణకు స్వయంగా స్వీట్లు తినిపించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి కృషి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గిరిజనులు సంక్షేమం, అభివృద్ధి ఎస్టీ కమిషన్ కృషి చేస్తోందని రాష్ట్ర ఏసీసీ కమిషన్ సభ్యుడు వదిత్యా శంకర్ నాయక్ అన్నారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల జిల్లాలో పర్యటనలో అనేక సమస్యలను గుర్తించానన్నారు. బొమ్మూరు, కడియం వేమగిరి ప్రాంతాల్లో గిరిజనులు నివాసాలు వుండే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేవని వాటిని చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. బాలుర కోసం ఆశ్రమ పాఠశాల లు ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు. గంజాయి రవాణా నిషేధంపై గిరిజన యువతలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆధార్, రేషన్ కార్డులు కూడా లేని సంచార జాతుల సమస్యలు పరిష్కరించాల్సి ఉందని నాయక్ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సీసెల్ నగర అధ్యక్షురాలు సాలా సావిత్రి, టీడీపీ ఎస్సీ ప్రాంతీయ సమన్వయ కర్త ఏ చిన్న తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువుగా కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం

● అమ్మవారి దర్శనం కోసం బారులు భక్తులు
● ట్రాఫిక్ క్రమబద్ధీకరించిన పోలీసులు


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిని ఆనుకుని మండలంలో చక్రద్వారబంధం-సూర్యారావుపేట గ్రామపొలిమేరల్లో ఉన్న శ్రీకనకదుర్గమ్మ 44వ వార్షిక తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా విగ్రహదాత అయ్యల సత్యనారాయణ దంపతులు సమర్పించిన ప్రత్యేక దుస్తులు, పూలమాలలను ఆలయ పురోహితులు భవానీభట్ల శ్రీకాంత్‌శర్మ అమ్మవారికి అలంకరించి, ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, జనసేన కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మితో పాటుగా పలు వురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బలరామకృష్ణను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకున్నారు. రాత్రి సమయంలో మిరుమిట్లు గొలిపే బాణా సంచాల కాల్పులు, పౌరాణిక, సాం స్కృతిక ప్రదర్శనా కార్యక్రమాలతో అమ్మవారి తీర్థం కన్నుల పండువుగా సాగింది.

ఘనంగా దుర్గమ్మ జాతర

కోరుకొండ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పవిత్ర మార్గశిరమాసం పౌర్ణమి వెళ్లిన 3వ రోజు మంగళవారం కోరుకొండ మండలంలో దుర్గమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ప్రతి సంవత్సరం ఖరీఫ్ వ్యవసాయ పంటలు పండించి ధాన్యం ఇంటికి వచ్చినవేళ దుర్గమ్మ జాతర నిర్వహించడం ఇక్కడ రైతాంగం ఆచారం. కోరుకొండ మండలం నర్సాపురం గ్రామంలో సీతంపేట దుర్గమ్మ ఆలయంవద్ద ప్రత్యేక పూజలు తీర్థ మహోత్సవాలు జరిగాయి.

ఆయిల్ ఫామ్ సాగుతో అధిక ఆదాయం


సదస్సులో మాట్లాడుతున్న డీజీఎం ప్రకాష్

గోకవరం డిసెంబరు17: ఆయిల్ ఫామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని పతంజలి సంస్థ డీజీఎం ఏఎస్.ప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని రంపయర్రంపాలెం గ్రామంలో మంగళవారం పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌ఫామ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సంస్థ డీజీఎం ప్రకాష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ తోటల ప్రాముఖ్యత, కంపెనీ ద్వారా అందించే సేవలు, సదుపాయాలు, పంట సాగులో ఎరువుల యాజమాన్యం, సాగులో విజయం సాధించిన రైతుల విజయ గాదల గురించి వివరించారు. ఆయిల్ సాగు టన్నుకు రూ.20,240లు ధర ఉందని, ఈ పంటే రైతులకు అనుకూలమైన పంట అన్నారు. ఈకార్యక్రమంలో పలువురు సంస్థ నిర్వహకులు, రైతులు పాల్గొన్నారు.

40 లీటర్ల సారా స్వాధీనం

రంగంపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉన్న వెంకటాపురం, వడిశలేరు గ్రామాల్లో ఆశాఖ అధికారులు మంగళవారం 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.

సరైన ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి సాధ్యం

● ఎంపీడీవో రామకృష్ణారెడ్డి


శిక్షణా శిబిరంలో ప్రసంగిస్తున్న ఎంపీడీవో రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధి కోసం సరైన ప్రణాళికలు రూపొందించుకోవడం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన సులభతరమౌతుందని ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌జీఎస్ఏ కార్యాచరణపై ప్రణాళికలు రూపొందించేందుకు రెండురోజుల పాటు నిర్వహించనున్న శిక్షణా శిబిరాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించే విధంగా శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి అధికారి అన్ని విషయాలపైనా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తుందని వాటిని సక్రమంగా అమలుచేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



అనపర్తి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): అనపర్తి ప్రాంత పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడిగా వాసంశెట్టి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో జరిగిన అనపర్తి బిక్కవోలు మండలాల పీఎంపీల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన నూతన కమిటీ ఎన్నికలలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాసంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శిగా డి.సాయిరామారెడ్డి, కోశాధికారిగా నీలంశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సిహెచ్‌వీ రామారావు, సహాయ కార్యదర్శి పీటీఎల్ నారాయణ, గౌరవాధ్యక్షుడిగా ఎస్ఎస్ చలం, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన కిడ్నీ వ్యాధి నిపుణుడు, సత్య కిడ్నీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఎన్.సత్యప్రసాద్ మూత్రాశయ వ్యాధులపైనా, కిడ్నీలో వచ్చే రాళ్ళపైనా ఏపీఎంపీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనపర్తి, బిక్కవోలు మండలాలకు చెందిన పీఎంపీలు పాల్గొన్నారు.

నగరంలో రూ.70 కోట్ల పనులు ప్రారంభించాం

● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో రూ.70కోట్ల విలువైన పనులు ప్రారంభించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలోని 7,8 డివిజన్లలో రూ.1.35 కోట్లతో చేపడుతున్న రహదారి, డ్రైనేజీ నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. దానవాయిపేట నెస్ట్ హాస్పిటల్ వీధిలో రూ.35లక్షలు, 8వ డివిజన్ హెడ్‌డీఎఫ్‌పీ బ్యాంక్ ఎదురు వీధిలో రూ.కోటితో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. రాజమహేంద్రవరాన్ని గుంతలు లేని సుందరమైన నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ నాయకులు వర్రే శ్రీనివాసరావు, కోరుమిల్లి విజయశేఖర్, బొర్రా చిన్ని, కోకోనట్ వాసు, దాస్యం ప్రసాద్, వై.దేవి ప్రసాద్, ప్రతాప్ యాదవ్ పాల్గొన్నారు.

టైలర్ మల్లిబాబుకు రూ.లక్ష రుణం అందజేత

ఇటీవల అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమై నష్టపోయిన టైలర్ మల్లిబాబును పరామర్శించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెంటనే స్పందించి అతనికి డ్వాక్రా సంఘం ద్వారా రూ.లక్ష రుణం ఇప్పించారు. ఈ మేరకు చెక్కును మంగళవారం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో బాధితుడి భార్యకు అందించారు.

మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తాం

కల్చర్ కాపిటల్‌గా ఉన్న రాజమహేంద్రవరాన్ని ఎన్నడూ లేనివిధంగా నేరాలకు కేంద్ర బిందువుగా మార్చిన ఘనులు వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో పోలీస్, ఈగల్‌టీమ్, షీటీమ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మీ భద్రత-మా బాధ్యత సభకు హాజరై మాట్లాడారు. నవయుగ వైతాళికుడు వీరేశలింగం పంతులు రాజ్యలక్ష్మీ దంపతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. గత వైసీపీ పాలకుల మాదిరి గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహించే ప్రభుత్వం తమది కాదన్నారు. అందుకే ప్రస్తుతం నేరాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఎక్కడా బ్లేడ్ బ్యాచ్‌ల అలజడి లేదన్నారు. మహిళకు పూర్తి రక్షణ కల్పించడమే తమ ధ్యేయమన్నారు. ఈ సభలో మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు.


108లోనే ప్రసవం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం బాలాజీ పేట ఆదర్శనగర్‌కు చెందిన రేవతి అనే గర్భిణీకి ఆమె ఇంటివద్దనే 108 అంబులెన్సులో పురుడు పోసిన సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. రేవతికి పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. వెంటనే సిబ్బంది అక్కడకు చేరుకుని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించేలోగా నొప్పులు ఎక్కువ కావడంతో మెడికల్ టెక్నీషియన్ సుహాసిని ఆమెకు పురుడు పోశారు. అనంతరం ప్రథమ చికిత్స కోసం తల్లి, ఆడ శిశువును ధవళేశ్వరం పీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

వడిశలేరులో ఇన్‌కంటాక్స్ అధికారుల తనిఖీ

రంగంపేట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలం వడిశలేరు గ్రామంలో లలితా రైసుమిల్లు, గొడౌన్ల నిర్మాణం కోసం రైతుల నుంచి కొనుగోలుచేసి భూమి ధరల గురించి మంగళవారం ఇన్‌కం టాక్స్ అధికారులు రైతులను విచారించారు. రికార్డులలో రూ. 18 లక్షలకు కొనుగోలుచేసినట్లు చూపించి రైతుల నుంచి ఎకరాకు రూ. 60నుంచి 70ల క్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది.

జేగురుపాడులో క్రిస్మస్ వేడుక


క్రిస్మస్ సంబరాలు చేసుకుంటున్న దృశ్యం

కడియం, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): బేతేలు ప్రార్థన మందిరం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు సంఘపాస్టర్ మాథ్యూస్‌చే ఘనంగా నిర్వహించారు. స్థానిక వాలీబాల్ గ్రౌండ్‌లో జరిగిన ఈ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ యాదల స్టాలిన్ పాల్గొన్నారు. కేకు కట్ చేసి క్రిస్మస్ సంబరాలు చేసారు. ఈ కార్యక్రమంలో డా. ఆర్ స్టీవెన్సన్, ఎం ఎలీషా, రవికిరణ్, రొంపిచర్ల ఆంటోనిదాస్, ఏసుక్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

ఢిల్లీ పర్యటనలో
పలువురిని కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి


ఢిల్లీలో కర్నాటక మాజీ సీఎం, ఎంపీ జగదీష్ సత్తార్‌ను కలిసి అభినందిస్తు న్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం పలువురు ప్రముఖులను కలుసుకున్నారు. ముందుగా రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నివాసంలో భేటీ అయిన ఎమ్మెల్యే అనపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం కలవాల్సిన మంత్రుల విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా కర్నాటక మాజీ ముఖ్యమంత్రి, బెల్గామ్ ఎంపీ జగదీష్ సత్తార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అదేవిధంగా కర్నాటక మాజీమంత్రి శంకర్ పాటిల్‌ను కూడా ఎమ్మెల్యే కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం బుధవారం పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నల్లమిల్లి వెంట బీజేపీ నాయకులు బిక్కిన విశ్వేశ్వరరావు ఉన్నారు.

ఫొటోగ్రాఫర్లకు ఎన్నికల బకాయిలు అందజేత

రాజానగరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వర్తించిన వీడియో గ్రాఫర్లకు నిలిచిపోయిన బిల్లులను బకాయిలు రూ.6.5 లక్షలను ఆర్డీవో కృష్ణనాయక్ మంగళవారం అందజేశారు. గత కొంతకాలంగా రాజానగరం తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో నేరుగా రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణనాయక్‌ను సంప్రదించగా బకాయిల సొమ్ము విడుదలచేసి అందజేశారన్నారు. ఈసందర్భంగా వీడియో గ్రాఫర్లు దొండపాటి లాజర్ తదితరులు ఆర్డీవో నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


ఫొటో గ్రాఫర్లకు బకాయి బిల్లుల నగదు అందజేస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

అన్నదానం

గోకవరం, డిసెంబరు17: గోకవరంలో రమణ మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా పాత బస్టాండ్ సమీపంలో గల రమణ మహర్షి విగ్రహంవద్ద భక్తులు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓం శ్రీ అరుణాచలేశ్వరస్వామి భగవాన్ శ్రీ రమణ మహర్షి పుట్టిన రోజును పురస్కరించుకొని భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.







వాతావరణ మార్పు.. వణుకుతున్న జనం

- కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు
- గజగజలాడుతున్న ప్రజానీకం
- జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- అల్పపీడన ద్రోణి ప్రభావం
- మరో మూడు రోజులింతే

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాను చలి వణికించింది. ఉదయం నుంచి రాత్రి వరకూ వాతావరణం ఏ మాత్రం మారలేదు. మబ్బు.మబ్బుగానే కనిపించింది. అంతే కాకుండా మధ్యాహ్నం సమయంలోనూ చలి వీడలేదు. చంటి బిడ్డలు మొదలుకొని వృద్ధుల వరకు చలి తీవ్రతకు గజగజలాడారు. గత మూడు రోజులుగా వాతావరణంలో తేడావచ్చింది. చలి పెరిగింది. రాత్రి సమయాల్లో అయితే ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. తెల్లవారుజామున ఏ స్థాయిలో చలి ఉందో అదే తీవ్రత 24 గంటలు పాటు కొనసాగడం గతంలో ఎన్నడూ చూడలేదు. మధ్యాహ్నం సమయానికి ఉపశమనం ఉండేది. అయితే మంగళవారం మాత్రం చలి పెరుగుతూనే ఉంది. జిల్లా ప్రజలను వణికించింది. చలిని తట్టుకోలేక చలి మంటలు వేసుకునే పరిస్థితి నెలకొంది.శీతాకాలంలో సాధారణంగా చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయితే దీనికి అల్పపీడన ద్రోణి ప్రభావం తోడు కావడంతో చలి తీవ్రత పెరిగింది. రోజంతా మబ్బు వాతావరణం ఉంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, అనపర్తి లాంటి ప్రాంతాల్లో సగటున ఉష్ణోగ్రత 27 నుంచి మొదలు కొని 32 డిగ్రీల మధ్య ఉంటుంది. అలాంటి ఈ ప్రాంతాల్లో ప్రస్తుతం 22 నుంచి 27 మధ్యలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఖచ్చితంగా చలి కోట్లు వేసుకుని, మాస్కులు ధరించి వెళ్లాల్సిన పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కాలువలు,పంట పొలాలు, తోటలకు నీరు పెట్టడం తదితర పనులతో అక్కడ చలి మరింత ఎక్కువ కావడంలో వణుకుతున్నారు. స్కూల్ పిల్లలు వణుకుతూ స్కూల్‌కి వెళుతున్నారు. వివిధ పనులపై బయటకు వెళ్లేవారు కూడా చలి తీవ్రతకు బేంబేలెత్తుతున్నారు.చిన్నారులు చలికి తట్టుకోలేక పాఠశాలలకు ఆలస్యంగా వెళుతున్నారు. చలి తీవ్రత కారణంగా పాఠశాలల ఆరంభ సమయం మార్చుచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

చలిగాలుల వేగం గంటకు 11 కి.మీ

జిల్లాలో అల్పపీడన ద్రోణి ప్రభావంతో చలిగాలుల తీవ్రత మరింతగా పెరిగింది. సాధారణస్థితిలో చలి తీవ్రత ఒక మోస్తరు ఉంటుంది. దానికి అల్పపీడీదన ద్రోణి తోడు కావడంతో గంటలకు 11 కిమీల వేగంతో చలిగాలులు వీస్తున్నాయి.దీని ప్రభావంతో 24 గంటలూ చల్లగానే ఉంటుంది.తలుపులు, కిటికీలు గుండా చలిగాలులు వీచి ఇంటా బయటా ఏసీ మాదిరిగా ఉంటుంది. మరొక మూడు రోజుల పాటు ఇలాంటి పరిస్థితే కొనసాగుతుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి..

చలిగాలులు కారణంగా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.చలి ప్రభావం చిన్నారులు, వృద్ధులపై ఎక్కువగా ఉంటుంది. బయటకు వెళితే తప్పనిసరిగా మంకీ క్యాప్, స్వెటర్ వినియోగించాల్సిందే. ప్రస్తుతం జలుబు, దగ్గు తదితర సమస్యలతో చిన్నారులు బాధపడుతున్నారు.



గత నెల 29న స్టెల్లా షిప్‌లో బియ్యం తనిఖీ చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ (ఫైల్)

స్టెల్లా షిప్‌లో పట్టుబడ్డ రేషన్ బియ్యం

- అంతా సత్యం బాలాజీ కంపెనీదే
- 1320 మెట్రిక్ టన్నులు పట్టివేత
- చత్తీస్‌గఢ్ కంపెనీ పేరు
- జూలైలో పట్టుబడ్డ బియ్యం
- పాలిష్‌చేసి మళ్లీ ఎగుమతి
- గుట్టు తేల్చేపనిలో అధికారులు
- నిలిచిపోయిన బియ్యం లోడింగ్
- హైకోర్టులో వ్యాపారుల పిటిషన్
- నేటి నుంచి ముమ్మర దర్యాప్తు
- నౌకలో బియ్యం దించాలని ఆదేశం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)


స్టెల్లా నౌకలో రేషన్ గుట్టు వీడింది.. విదేశాలకు తరలిపోవడానికి సిద్ధమైన పేదల బియ్యం లెక్కతేలింది. అధికారుల కళ్లుగప్పి.. చెక్ పోస్టులను మాయచేసి సముద్రాలను దాటించేయడానికి చూసిన బియ్యం స్మగ్లింగ్ దందా బయట పడింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 1,320 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి దేశాలు దాటించేయడానికి చూసిన అక్రమార్కుల పాపం పండింది. ఈ నేపథ్యంలో గుర్తించిన బియ్యాన్ని నౌక నుంచి కిందకు దించేయడానికి అధికారులు నిర్ణయించారు.అసలు ఈ బియ్యం సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై నేటి నుంచి దర్యాప్తు చేయబోతున్నారు. ఏ మిల్లుల నుంచి ఈ సరుకు వచ్చింది? చత్తీస్‌గఢ్‌కు చెందిన సదరు సత్యం బాలాజీ కంపెనీకి ఇక్కడ సహకరిస్తున్నదెవరు అనే గుట్టులాగనున్నారు. నౌక నుంచి రేషన్‌బియ్యం దించేయాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ ప్రస్తుతం సముద్రంలో అల్లకల్లోల వాతావరణంతో ఇది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. మరోపక్క ఈ అన్‌లోడింగ్ పూరయ్యాకే మిగిలిన బియ్యాన్ని లోడ్‌చేసి పది రోజుల్లో స్టెల్లా కదలడానికి అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతికి అధికారులు అనుమతించడం లేదని కొందరు వ్యాపారులు కోర్టును ఆశ్రయించడం విశేషం.

స్టెల్లా కదిలేది అప్పుడేనా...

పనామా ఫ్లాగ్‌తో ఉన్న స్టెల్లా నౌక కాకినాడకు బియ్యం లోడింగ్‌కు వచ్చి 35రోజులుపైనే దాటుతోంది. ఇందులో రేషన్ బియ్యం లోడైన నేపథ్యంలో అదనపు తనిఖీలు, శాంపిళ్ల కోసం ఈ నౌకలోకి బియ్యం లోడింగ్‌ను అధికారులు నిలిపివేశారు. దీంతో అప్పటి నుంచీ ఈ నౌక కాకినాడలోనే ఉండిపోయింది. అయితే ఇప్పుడు శాంపిళ్ల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో గుర్తించిన రేషన్ బియ్యాన్ని దించేయనున్నారు. ఈమేరకు పోర్టు అధికారులు కస్టమ్స్ విభాగంతో సంప్రదింపులు జరపగా బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ మొదలుపెట్టి రెండు రోజుల్లో సరుకంతా దించేయాలని భావించారు. తీరా అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రంలోపల గంటకు 48 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తుండడంతో బుధవారం నుంచి అన్‌లోడింగ్ ప్రక్రియ సాధ్యం కాదని తేల్చేశారు. వాతావరణం సద్దుమణిగిన తర్వాత బియ్యం అన్‌లోడింగ్ చేయడం, ఇంకా మిగిలిన 12 వేల మెట్రిక్ టన్నులు నౌకలోకి లోడింగ్ చేయాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ పూర్తికావడానికి దాదాపు రెండు వారాలకుపైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతే కాకినాడ నుంచి స్టెల్లా నౌక కదలనుంది. కాగా స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఉన్నాయనే కారణంతో ఈ నౌకలోకి తమ పారాబాయిల్డ్ బియ్యం ఎగుమతి చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారంటూ మూడు బియ్యం ఎగుమతి కంపెనీలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో హైకోర్టు విచారణలో భాగంగా నౌకలో బియ్యం లోడింగ్ జరగకుండా ప్రభుత్వానికి అడ్డుకునే అధికారాలు ఏమిటని న్యాయస్థానం మంగళవారం ప్రశ్నించింది. ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది.

ఆ బియ్యం అవే..

కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు అక్రమంగా రేషన్ బియ్యం ఎగుమవుతున్నాయన్న వైనం మరోసారి పక్కా ఆధారాలతో బయటపడింది. ఈమేరకు స్టెల్లా షిప్‌లో అధికారులు డిసెంబరు 4న సేకరించిన 12 శాంపిళ్ల నిజాలను నిర్ధారించాయి. షిప్‌లో ఐదు హేచ్‌ల్లో లోడైన మొత్తం 32,416 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యంలో మూడో నెంబర్ హేచ్‌లో ఎగుమతికి సిద్ధం చేసిన పది వేల మెట్రిక్ టన్నుల సరుకులో రేషన్ బియ్యం ఆనవాళ్లు తేలాయి. ఈ బియ్యం అంతా సత్యం బాలాజీ కంపెనీదిగా అధికారులు గుర్తించారు. వాస్తవానికి స్టెల్లా నౌకలో రేషన్ బియ్యం ఎగుమతి జరుగుతుందనే సమాచారంతో గత నెల 29న డిప్యూటీ సీఎం పవన్ అక్కడకు వెళ్లి షిప్‌ను సీజ్ చేయాలని ఆదేశించారు. ఆ సమయానికి నౌక హేచ్-1లో 640 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధారించారు. అయితే మిగిలిన హేచ్‌ల్లో లోడైన బియ్యాన్ని కూడా తనిఖీ చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది జూలైలో పట్టుబడ్డ 42 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని న్యాయస్థానం ఆదేశాలతో బ్యాంకు గ్యారంటీలు తీసుకుని వ్యాపారులకు తిరిగి అప్పగించేశారు. అయితే నౌకలో పట్టుబడ్డ బియ్యం.. అప్పట్లో వెనక్కు ఇచ్చేసిన బియ్యం ఒకటేనా అనే దానిపైనా శాంపిళ్లను సరిపోల్చగా మొత్తం బండారం బట్టబయలైంది. అప్పుడు వెనక్కు ఇచ్చేసిన బియ్యం, షిప్‌లో లోడైన బియ్యం ఒకటేనని ఎట్టకేలకు తేలింది. స్టెల్లా నౌకలో లోడైన 15 కంపెనీలకు చెందిన 32,416 మెట్రిక్ టన్నుల బియ్యంలో సత్యం బాలాజీ అనే కంపెనీకి చెందిన 10 వేల మెట్రిక్ టన్నుల్లో మొత్తం 1,320 మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించారు. ఇందులో 640 మెట్రిక్ టన్నులు గతంలో గుర్తించిందే కాగా అదనంగా శాంపిళ్ల ద్వారా 680 మెట్రిక్ టన్నులు కొత్తగా రేషన్‌గా బయటపడింది. ఇదంతా నౌక నుంచి దించేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే చత్తీస్‌గఢ్‌కు చెందిన సత్యం బాలాజీ కంపెనీ కాకినాడ యాంకరేజ్‌పోర్టు ద్వారా రేషన్ బియ్యం ఎగుమతికి బరితెగించిందంటే అసలు ఇంత బియ్యం ఆ కంపెనీకి ఎలా వచ్చాయనేది విస్మయ పరుస్తోంది. ఈ బియ్యం అంతా కాకినాడ జిల్లాలో సేకరించినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు నేటి నుంచి దర్యాప్తు ముమ్మరం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ కంపెనీ తరపున బియ్యాన్ని షిప్‌లోకి ఎగుమతి చేస్తోన్న లోటస్ మెరైన్ లాజిస్టిక్స్ అనే షిప్పింగ్ కంపెనీ ప్రతినిధులను విచారించనున్నారు. మరో పక్క జులైలో పట్టుబడ్డ తమ రేషన్ బియ్యాన్ని సత్యం బాలాజీ కంపెనీ తిరిగి మిల్లుల్లో పాలిష్ చేసి ప్యాకింగ్ చేసి ఎగుమతి చేస్తోన్న నేపథ్యంలో ఇందుకు సహకరించిన మిల్లులపైనా గురి పెట్టనున్నారు. ఒకరకంగా చెప్పాలంటే సత్యం బాలాజీ రేషన్ అక్రమాల డొంక కదిలిస్తే పెద్దఎత్తున పీడీ కేసులు నమోదు చేసే అవకాశం ఉంది. మిల్లుల బాగోతమూ బట్టబయలుకానుంది.



మంత్రిగారూ! ఎన్నికలెప్పుడు?

గత ప్రభుత్వంలో జరగని కార్పొరేషన్ ఎన్నికలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికలు నిర్వహించి పదేళ్లు దాటేసింది.2019లో వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత కార్పొరేషన్ ఎన్నికలను అసలు పట్టించుకోలేదు.దీంతో గత ఐదేళ్లు కార్పొరేషన్‌కు పాలకవర్గం లేకుండా పోయింది. ప్రత్యేకాధికారుల పాలనలోనే నడిచింది. దీంతో గత వైసీపీ నాయకుల ఇష్టారాజ్యంగా మారపోయింది. ఇష్టాను సారంగా నిధులు ఖర్చు చేసేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ ఎన్నికల మీద ఆశ కలిగింది.పాలక వర్గం లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని.. డివిజన్లలో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని ప్రజ లంతా వాపోతున్నారు. గతంలో మా డివి జన్‌లో సమస్య ఉంటే కౌన్సిలర్‌కు తెలియజేసేవారమని..ఏదో ఒక విధంగా పరిష్కారమయ్యేదని.. ఇప్పుడు ఎవరికి చెప్పాలో అర్థం కావడంలేదని వాపోతున్నారు. ఎన్నికలతో పాటు సుమారు 20 గ్రామాల విలీన సమస్య ఉంది.వాటిని విలీనం చేసి గ్రేటర్ రాజమహేంద్రవరంలో అభివృద్ధి చేయాలనేది స్థానిక ప్రజల కోరిక.ఇటు ఎన్నికలు జరగలేదు. గ్రామాల విలీనమూ లేదు. ఆ గ్రామాలకు ఎన్నికలూ జరగలేదు. ఎన్నికలు లేకపోతే 15వ ఆర్థిక సంఘం నిధులు రావడం లేదనే ఆందోళన ఉంది. మంత్రి గ్రామాల విలీనం.. ఎన్నికలపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు మంత్రి నారాయణ పర్యటన

రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ బుధవారం రాజమహేంద్రవరంలో పర్యటించనున్నారు. క్వారీ సెంటర్‌లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తారు. ఉదయం 9 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకుని ప్రజాప్రతినిధులు ,అధికారులతో చర్చిస్తారు.

పనులు కాకుండానే..బిల్లులు చెల్లింపులు

- సామాజిక తనిఖీలో గుర్తింపు
- పీఆర్ సిబ్బందిపై మండిపాటు
- వెంటనే పూర్తిచేయాలని ఆదేశం
- కడియంలో డ్వామా పీడీ



కడియం సామాజిక తనిఖీలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కడియం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం నిధుల దుర్వినియోగం సహించనని డ్వామా పీడీ నాగమహేశ్వరరావు అన్నారు.కడియం మండలంలో పంచాయతీరాజ్ శాఖ వారు పనులు పూర్తి కాకుండా ముందస్తు బిల్లులు చెల్లింపుపై మండిపడ్డారు. గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు జరిగిన పనుల్లో భాగంగా మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో 17వ విడత సామాజిక తనిఖీ జరిగింది. ఈ నెల 4 నుంచి 12 వ తేదీ వరకు మండలంలో జరిగిన పనులను పరిశీలించారు. ఈ సామాజిక తనిఖీల్లో పంచాయతీరాజ్ శాఖ ద్వారా గ్రామాలకు సంబంధించి రూ. 6,37,854 ముందస్తు చెల్లించినట్టు గుర్తించారు. వెంటనే ఆ పనులు పూర్తి చేసి ఫొటోలతో సహా ఆధారాలు చూపించాలని పంచాయతీరాజ్‌శాఖకు ఆదేశించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులు సక్రమంగా నిర్వహణ లేకపోవడంతో రూ.4 వేలు జరిమానా విధించారు. వివిధ గ్రామ పంచాయతీల్లో ఉపాధిపనుల మస్తర్లు దిద్దుబాటుతో పాటు సక్రమంగా లేకపోవడంతో రూ. 17 వేలు రికవరీకి ఆదేశించారు. మండలంలో 627 పనులకు వేతన విలువ రూ. 1,61,89,393, మెటీరియల్ విలువ రూ. 3,07,30,607 కలిపి మొత్తం రూ 4,69,20,000 పై సామాజిక తనిఖీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్, ఏపీడీ రామ్‌ప్రసాద్, ఎంపీడీవో కె రమేష్, సోషల్‌ఆడిట్ సిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవిని సత్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి,ఎమ్మెల్యేలు

దివ్యాంగులను ప్రోత్సహించండి : కలెక్టర్

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పట్ల సానుభూతిని చూపించడం కాదని వారిలో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించి వారికి భవిష్యత్‌ను ఇవ్వాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ సభకు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు సామాజిక భద్రత పెన్షన్ కింద ఇంటి వద్దే రూ.6 వేలు ప్రతినెలా అందిస్తుందని.. పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు మెకనైజ్డ్ బ్యాటరీ ట్రైసైకిల్స్, ట్రైసైకిల్స్ దివ్యాంగుల చైర్స్ కోసం ఎక్కువ విజ్ఞప్తులు వస్తున్నాయని చెప్పారు. జిల్లాలో దివ్యాంగుల కోసం పనిచేస్తున్న జియోన్,పలుకు, సంకల్పం ఫస్ట్, కన్నా వంటి సంస్థల భాగస్వామ్యం స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ గత ప్రభుత్వం జియోన్ సంస్థకు సంబంధించి దివ్యాంగుల ఆశ్రయాన్ని ఖాళీ చేయించడం అన్యాయమన్నారు.జిల్లా కలెక్టర్ వారికి తగు న్యాయం చేయాలని కోరారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతులకు సహకరించాలన్నారు. దివ్యాంగులకు అవకాశం ఇస్తే ఏదైనా సాధిస్తారన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులను సత్కరించి జ్ఞాపిక అందించారు.కన్నా ఆశ్రయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ గండి శకుంతలాదేవిని కలెక్టర్ ప్రశాంతి,ఎమ్మెల్యేలు సత్కరించారు.తొలుత కన్నా ఫౌండేషన్, ధవళేశ్వరం పలుకు సంకల్ప పాఠశాల విద్యార్థుల నృత్య పదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 742 అర్జీలు స్వీకరణ

రాజమహేంద్రవరం, డిసెంబరు17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇప్పటి వరకూ 70 గ్రామ పంచాయతీల పరిధిలోని రెవెన్యూ సదస్సులు నిర్వహించి,742 అర్జీలు స్వీకరించామని వాటిలో 95 ఇప్పటికే పరిష్కరించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జనవరి 8వ తేదీ వరకూ రెవెన్యూ సదస్సులు జరు గుతాయన్నారు.అర్జీల పరిష్కారంలో అధికా రులంతా టైంలైన్‌తో కూడిన మార్గదర్శకాలు పాటించాలన్నారు.జవాబుదారీతనం ఉండే విధంగా అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని,ప్రతి నియోజకవర్గ బాధ్యత ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు అప్పగించామన్నారు.

ప్రీమియం లిక్కర్ స్టోర్ ఏర్పాటుకు
దరఖాస్తుల ఆహ్వానం
ఈ నెల 31వ తేదీ వరకు గడువు
దరఖాస్తు రుసుం రూ.15 లక్షలు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి):నూతన ఎక్సైజ్ విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 12 ప్రీమియం లిక్కర్ స్టోర్సు ఏర్పాటు చేసుకునేందుకు గెజిట్‌ను జారీ చేసిందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.రాజమహేంద్రవరం, కాకినాడ మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఒక్కొక్కస్టోర్ చొప్పున ఏర్పాటు చేసుకునేందుకు ఆమోదం తెలిపింది. ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులను ఆఫ్ లైన్‌లో అందించాలని సూచించారు. దరఖాస్తు రుసుం రూ.15 లక్షలు కాబట్టి ఆన్‌లైన్‌లో తప్పిదాలు జరిగే ఆస్కారం ఉన్నదందున ఆఫ్‌లైన్ విధానంలోనే ఇది జరుగుతుందని పేర్కొన్నారు.ఈ స్టోర్ లైసెన్స్ కాలపరిమితి ఐదేళ్లు. మొదటి సంవత్సరం లైసెన్సుదారులు చెల్లించాల్సిన వార్షిక పన్ను రూ.కోటి , రెండో ఏడాది నుంచి 10 శాతం పెరుగుదల ఉంటుందన్నారు. ప్రీమియం స్టోర్ కనీస కార్పెట్ వైశాల్యం 4000 చదరపు అడుగులు ఉండాలన్నారు.ప్రీమియం స్టోర్ దరఖాస్తు కోసం హెచ్‌టీపీఎస్://ఏపీఎస్‌బీసీఎల్.ఏపీజీవోవీ.ఇన్ నందు డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉందన్నారు. దరఖాస్తుదారులు గమనించాలని సూచించారు.

భీమోలు భూములపై జేసీ విచారణ

గోపాలపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమోలు గ్రామంలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న ల్యాండ్ సీలింగ్ భూములపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విచారణకు ఆదేశించారు.ఈ మేరకు జేసీ చినరాముడు మంగళవారం భీమోలు గ్రామంలోని సచివాలయం వద్ద విచారణ చేపట్టారు.భీమోలు సచివాలయం వద్దకు మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు చేరుకున్న జేసీ మొదట జమిందారి వారసులు పట్టాదారులతో విడివిడిగా మాట్లాడి వారు తెలిపిన వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం గోపాలపురం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో కౌలుదారులతో జేసీ మాట్లాడారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు కొవ్వూరు ఆర్‌డీవో వద్దకు వచ్చి కౌలుదారుల అభిప్రాయాలు తెలపాలని సూచించారు. ఆయన వెంట ఆర్‌డీవో డాక్టర్ రాణి సుస్మిత, తహశీల్దార్ అజయ్‌బాబు, ఎస్ఐ కే.సతీష్ కుమార్ ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జేసీ

పోలీసులపైనే ఎటాక్ చేశారు..
అడ్డంగా బుక్కయ్యారు!

చేసేది తప్పుడు పని.. తమ ముఠా నాయకుడు చిక్క కూడదని మరో తప్పు చేసేశారు.. దొంగనోట్ల కేసులో అరెస్టు చేసి తీసుకెళుతున్న ముఠా నాయకుడిని తప్పించేందుకు పోలీసుల మీదే ఎటాక్ చేశారు.. పోలీసులు ఊరుకుంటారా.. తీగలాగితే డొంక కదిలింది.. ఏకంగా రెండు జిల్లాల్లో దొంగ నోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్న ముఠాను పట్టుకున్నారు.. మంగళవారం అరెస్టు చూపించారు.. దీంతో 18 మంది దొంగనోట్ల ముఠా సభ్యులు అడ్డంగా బుక్కయ్యారు..వీరిలో 13 మంది జైలులో ఊచలు లెక్కపెడుతుండగా మరో ఐదుగురు పరారీలో ఉన్నారు.. - వివరాలు 7లో



పోలీసులకు చిక్కిన 13 మంది నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

2.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు : జేసీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకూ 2.32 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు జేసీ ఎస్. చిన్న రాముడు తెలిపారు.మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. జిల్లాలో 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 29,101 మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రూ.488 కోట్లు జమ చేశామన్నారు.ధాన్యం సేకరించిన 48 గంటల్లోనే డబ్బు జమ చేస్తున్నామన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ప్రభుత్వ మెనూ అమలుచేయాలి

» ఆర్డీవో రాణి సుస్మిత » పెరవలి నెంబర్-1 ప్రాథమిక పాఠశాల తనిఖీ



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో సుస్మిత

పెరవలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రతి పాఠశాలలో ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం అందించాలని, ఎక్కడ ఎటువంటి తేడా జరిగినా చర్యలు తీసుకుంటామని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత హెచ్చరించారు. పెరవలి నెంబర్-1 ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఉదయం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనంపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల చదువు కోసం ప్రభుత్వం వివిధ రూపాల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం అందరికీ సక్రమంగా అందుతుందో లేదో అని ఆరా తీశారు. ఇదిలా ఉండగా పెరవలి డిస్ట్రిబ్యూటరి కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సుస్మిత ఆధ్వర్యంలో జరిగింది. ఛైర్మన్‌గా బూరుగుపల్లి శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్‌గా నల్ల భాస్కరరావు ఎన్నికయ్యారు. వారిద్దరినీ ఆర్డీవో అభినందించారు. కార్యక్రమాల్లో తహశీల్దార్ అచ్యుతకుమారి, పలు నీటి సంఘాల అధ్యక్షులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

21న కొవ్వూరులో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఈ మేరకు మంగళవారం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్ జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికాస ఆధ్వర్యంలో కొవ్వూరు ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జాబ్‌మేళా ఏర్పాటు చేశామని, టెక్నికల్, నాన్ టెక్నికల్, ఐటీ, ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్ వంటి వివిధ రకాల విభాగాల్లో 28 కంపెనీల్లో సుమారు 1500 ఉద్యోగాల కల్పనకు ముం దుకు వచ్చాయన్నారు. ఆసక్తి యువత ఉదయం 9 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరుకావాలన్నారు. యువతకు ఉద్యోగవకాశాలు కల్పించే దిశగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు కలెక్టర్ చెప్పారు. యువతీయువకులు నైపుణ్యాభివృద్ధి కోసం నాక్ సంస్థను గాని, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్‌ను గాని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చరావు, మేనేజర్ శర్మ, బాబు పాల్గొన్నారు.

నేడు కోట సత్తెమ్మకు బోనాల సమర్పణ



నిడదవోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో అమ్మవారి తిరునాళ్లలో భాగంగా మూడో రోజు మంగళవారం విశేష పూజలు చేశారు. ఉదయం చండీ పారాయణం, సాయం కాలం చండీహోమం నిర్వహించారు. నిడదవోలు ఆర్య వైశ్య సంఘం వారు చీర సారె సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

101 మంది మహిళలతో..

అఖిల భారత తెలుగుసేన ఆంధ్రప్రదేశ్ మహిళా అధ్యక్షురాలు, అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలతో చీర సారె, కలశాలు, బోనాలతో అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించనున్నారు.

పాడి రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం



రైతులకు చెక్కులు అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

నల్లజర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆదాయం పెంచడమే కృష్ణ మిల్క్ యూనియన్ లక్ష్యమని కృష్ణ మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. స్థానిక అల్లాడ రామకృష్ణ కళ్యాణ మండపంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాడి రైతులకు 2024-25 సంవత్సరానికి సంబంధించి రెండో విడత బోనస్ పంపిణీ కార్యక్రమం ఎండీ కొల్లు ఈశ్వర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి నవంబరు వరకు రెండు విడతలుగా పాడి రైతులకు రూ.4.34 కోట్ల బోనస్ పంపిణీ చేశామన్నారు. రైతు శ్రేయస్సు కోసం ఆధునిక సంస్కరణలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, ఘంటా నాగేశ్వరరావు, యలమాటి ఆనంద్, అల్లూరి దుర్గారావు, పెండ్యాల వీరాఘవులు పాల్గొన్నారు.

ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరం



డాక్టర్ సుబ్బారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు/తాళ్లపూడి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలోను, తాళ్లపూడి మండలం మలకపల్లిలోను మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏలూరులోని విజయ చర్మవ్యాధుల ఆసుపత్రి డాక్టర్ డి.సుబ్బారావు సహకారంతో ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరం నిర్వహించారు. కొవ్వూరులో వైద్య శిబిరానికి ఎమ్మెల్యే ముప్పిడి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. డాక్టర్ సుబ్బారావును సత్కరించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ మాట్లాడుతూ కొవ్వూరు శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమాల్లో నామాన బుల్లిరాజు, నాళం శ్రీనివాసరావు, పాలింపాటి చిన్నబాబు, లయన్స్ క్లబ్ తాళ్లపూడి అధ్యక్షుడు కుంటముక్కల వీరభద్రరావు మార్ని రామ్మూర్తి, ఎల్లిన బ్రహ్మానందం, నున్న శేఖర్‌బాబు పాల్గొన్నారు.

దూబచర్లలో దోపిడీ దొంగల భీభత్సం



అనారోగ్యంతో మంచంపై ఉన్న లక్ష్మీకుమారి

» విశ్రాంత వ్యవసాయ అధికారి ఇంట్లో చోరీ
» 24 గ్రాముల బంగారం, రూ.30 వేల నగదు అపహరణ

నల్లజర్ల, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలం దూబచర్లలో మంగళవారం తెల్లవారుజామున దోపిడీ దొంగలు భీబత్సం సృష్టించి 24 గ్రాముల బంగారం, రూ.30వేల నగదు దోచుకెళ్లారు. స్థానికుల వివరాల ప్రకారం.. దూబచర్ల గ్రామానికి చెందిన విశ్రాంత వ్యవసాధికారి చీమకుర్తి వీరభద్ర అప్పల కృష్ణమూర్తి తన భార్య లక్ష్మీకుమారితో కలిసి పాత ఇండియన్ బ్యాంకు ఉన్న ఇంట్లో జీవిస్తున్నారు. లక్ష్మీకుమారి అనారోగ్యంతో మంచంపైనే ఉంటున్నారు. ఆమెకు సహాయకురాలిగా అదే గ్రామానికి చెందిన జుత్తింగ పెద్దింట్లను నియమించుకున్నారు.మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కృష్ణమూర్తి ఇంటి తలుపులు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడే ఉన్న పెద్దింట్ల.. ఎవరు అంటూ ప్రశ్నించేలోగా ఆమెను కొట్టి చీరతో చేతులు కట్టేశారు. ఆపై కృష్ణమూర్తి చేతులను సైతం తాళ్లతో కట్టి లక్ష్మీకుమారి మెడలో ఆభరణాలతోపాటు బీరువా పగులగొట్టి 24 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు దోచుకుని వెళ్లిపోయారు. సంఘటన నుంచి తెరుకున్న కృష్ణమూర్తి 112కి కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్పీ సుబ్బారాజు, డీఎస్పీ దేవకుమార్, దేవరపల్లి సీఐ బీస్ నాయక్, ఎస్ఐ సోమరాజు, రమేష్, బాలాజీ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వేలిముద్రలు సేకరించి, డ్యాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సుబ్బారాజు

నేడు కొవ్వూరు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ అధ్యక్షతను జరిగే ఈ సమావేశంలో వివిధ గ్రామాల్లో చేపట్టిన, చేపట్టనున్న అభివృద్ధి పనులపై చర్చిస్తారని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక



చాగల్లులో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

» డీపీఆర్‌సీ ట్రైనింగ్ అధికారి ప్రసంగిరాజు
» సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండో విడత శిక్షణ

చాగల్లు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ముందు చూపుతో ప్రణాళికబద్ధంగా పనిచేయాలని జిల్లా పంచాయతీరాజ్ రిసోర్స్ సెంటర్(డీపీఆర్‌సీ) ట్రైనింగ్ అధికారి జి.ప్రసంగిరాజు అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండో విడత శిక్షణ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రసంగిరాజు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంలో పనిచేసి ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణాకార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని దొమ్మేరు, కాపవరం, పంగిడి, నందమూరు, పశివేదల గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణా తరగతులను ఎంపీడీవో కె.సుశీల ప్రారంభించారు. టీవోటీ ముత్యం శిక్షణ అందించారు. గ్రామీణ ప్రజల ఆర్థిక సుస్థిరత, జీవన ప్రమాణాల పెంపుదలకు తీసుకోవలసిన అంశాలను వివరించారు. బాలల వికాసం, ఆరోగ్యంపై శిక్షణను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం రత్నకుమారి పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు ఎంపీపీ కేవీకే దుర్గారావు విచ్చేసి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఏఏ చర్యలు తీసుకోవాలో గ్రామ కార్యదర్శులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యా లయంలో 93మందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.

ఉండ్రాజవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి డీపీఆర్‌సీ ప్రతినిధి ప్రసంగిరాజు విచ్చేసి మాట్లాడారు. పంచాయతీల సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని, పంచాయతీలకు వనరులు సమకూర్చుట ద్వారా ఆదాయాలు పెంచుకోవచ్చని చెప్పారు. ఆదాయాల కల్పన ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. మరో ప్రతినిధి చక్రపాణి వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. తొలుత ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి మహాత్మ గాంధీ, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కేఎస్ఆర్ శర్మ, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లిలో మాట్లాతున్న ఎంపీపీ దుర్గారావు



కొవ్వూరులో శిక్షణ ఇస్తున్న అధికారులు

సాగు నీటి సంఘాల అధ్యక్షులకు సన్మానం

నిడదవోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సమిశ్రగూడెంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఇటీవల ఎన్నికైన నిడదవోలు సాగు నీటి సంఘాల అధ్యక్షులను సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలగన సూర్యారావు, ఎంవీవీ సత్యనారాయణ, ఉప్పలపాటి సత్తిరాజు, పడాల శ్రీనివాస్, చిన్నిరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాధ్యక్షురాలు షర్మిలారెడ్డి పుట్టినరోజు

నిడదవోలు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి పుట్టినరోజును నిర్వహించారు. కేక్ కటింగ్ అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణాధ్యక్షుడు మేడవరపు భద్రందొర, చిన్నం మురళీకృష్ణ, కారింకి వెంకటేశ్వరరావు, షేక్ కాశీమ్, శారద పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

గోపాలపురం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కులంపేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని భీమోలు గ్రామానికి చెందిన పెనుమాక మోషేను స్థానిక కోడి అనీల్‌కుమార్ కులంపేరుతో దూషించి హత్యాప్రయత్నం చేసినట్టు ఈ నెల 10న ఫిర్యాదు చేశారన్నారు.దీనిపై దర్యాప్తు అనంతరం కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీఐ నాయక్ ఆదేశాల మేరకు మంగళవారం కోడి అనీల్‌కుమార్‌ను అరెస్టు చేసి కొవ్వూరు కోర్టుకు హాజరుపరిచినట్టు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ అందజేత

పెరవలి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యపరంగా ఇబ్బందులు ఉన్న కుటుంబాల వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి తోడ్పడుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ఖండవల్లికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను వేలివెన్నులో అందజేశారు. కూనపరెడ్డి కృష్ణకుమార్‌కు రూ.1,28,500, కత్తుల శ్రీలక్ష్మికి రూ.68,100, కేతా సత్యవతికి రూ.48,400, తానేటి ప్రసాద్‌కు రూ.42,700, బొల్లం రాధకు రూ.37,159, అనుకుల సాయి సతీష్‌కు రూ.32,100 చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అతికాల రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయుడికి పూజలు

చాగల్లు, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): చాగల్లులో భక్తాంజనేయస్వామి ఆలయంలో వ్రత మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. మంగళవారం పోలిశెట్టి ఉమా మహేశ్వరరావు, నాగసత్య పద్మజ దంపతులు విశేష పూజలు నిర్వహించారు. స్వామికి అభిషేకాలు, సహస్ర సింధూరార్చన, నాగవల్లి దళార్చన, సహస్ర పుష్పార్చన జరిగాయి. భజన కీర్తనలు, స్తోత్రాలు గానం జరిగింది. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దేవరపల్లి: దేవరపల్లిలో అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి వారోత్సవాల్లో భాగంగా సువర్చల సమేత ఆంజనేయస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామికి సామూహిక కుంకుమ పూజలు జరిపారు. సహస్ర నామార్చన చేశారు. వేద పండితులు కల్యాణ జరిపించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు పాల్గొన్నారు.

పెన్షన్..ఉద్యోగుల హక్కు



తాళ్లపూడిలో పెన్షనర్స్ డే నిర్వహిస్తున్న ఏఎస్‌వో జోడాల, ఉద్యోగులు

» సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు
» జాతీయ పెన్షనర్స్ డే
» రిటైర్డ్ ఉద్యోగులకు సత్కారం

తాళ్లపూడి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పెన్షన్ అనేది భిక్ష కాదని, ఉద్యోగుల హక్కు అని పెన్షన్ అనేది వాయిదా పడిన వేతనం అని జిల్లా సీపీఎస్ అధ్యక్షుడు జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. జాతీయ పెన్షనర్స్ డేను మంగళవారం పలుచోట్ల నిర్వహించారు. తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి జోడాల విచ్చేసి మాట్లాడారు. పెన్షనర్స్ జీవితాల్లో వెలుగులు నింపిన డీఎస్ నకారా సుప్రీంకోర్టులో చేసిన న్యాయపోరాటంలో చరిత్రాత్మకమైన తీర్పు వెలువడిన డిసెంబరు 17వ తేదీని పెన్షనర్స్ డేగా జరుపుకుంటున్నారన్నారు. ఉద్యోగులు పదవీ విరమణ తరువాత కూడా సామాజిక ఆర్థిక భద్రతతో జీవిస్తున్నారంటే దానికి కారణం డీఎస్ నకారా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు పప్పు వెంకటరామారావు విచ్చేసి డీఎస్ నకార చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల పింఛన్ల కోసం డీఎస్ నకార ఎంతో కృషి చేశారని, ఆయన మనకు ఆరాధ్యుడని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల పించన్‌దారులందరూ ఏకతాటిపై నిలబడి ప్రభుత్వాల నుంచి అందాల్సిన హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు వై.యలమాటి సత్యనా రాయణ, ఎస్‌కే సయ్యద్‌అలీ, అరుణకుమార్, విష్ణుభట్ల సీతారామయ్య, విష్ణుభట్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: స్థానిక అంబేడ్కర్ రీడింగ్ రూంలో జరిగిన పెన్షనర్ల దినోత్సవంలో సీనియర్ సభ్యులను సత్కరించి నూతన వస్త్రాలు బహూకరించారు. ప్రభుత్వం పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని, డీఆర్ బకాయిలను వెంటనే చెల్లించాలని సమావేశంలో తీర్మాణించారు. సమావేశంలో జగతా సత్యన్నారాయణ, నాగలక్ష్మి, కేఎస్ఎన్ మూర్తి, డి నాగేశ్వరరావు, ఆత్కూరి రామారావు, గంజి డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నల్లజర్లలో విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించి 40 ఏళ్ల సర్వీస్ చేసిన ఉద్యోగులైన మేడిది జయమణి, సురీడు వెంకటేశ్వరరావులను సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్ఎం అలీ సాహెబ్ మాట్లాడుతూ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని, 2018నుంచి రావలసిన డీఆర్, పీఆర్‌సీ బకాయిలను ఒకే దఫాలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, ఏసుర్నం, బాలయ్య, కామేశ్వరరావు పాల్గొన్నారు



దేవరపల్లిలో నాగేశ్వరరావు దంపతులకు సత్కారం



చాగల్లులో సీనియర్ సభ్యులకు సత్కారం

భూసమస్యల పరిష్కారమే ధ్యేయం



పెద్దేవంలో రైతులకు 1బి ఫారాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

» గోపాలపురం తహశీల్దార్ అజయ్‌బాబు
» పలుచోట్ల రెవెన్యూ సదస్సులు
» అర్జీలు స్వీకరించిన అధికారులు

తాళ్లపూడి, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ధ్యేయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు.మండలంలోని పెద్దేవం గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి రైతులు, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు పాల్గొని తమ శాఖకు చెందిన భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య ఆర్ అండ్ బీ రోడ్డు ఆక్రమణలను పలువురు తెలిపారు. పలువురు రైతులకు 1బి సర్టిఫికెట్‌లు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవీంద్రనాథ్, సర్వేయర్ సత్యనారాయణ, కార్యదర్శి సాంబమూర్తి, కూటమి నాయకులు కొడి శంకరం, బోడపాటి గంగరాజు, నామన చినబూరయ్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని యాదవోలులో జరిగిన రెవెన్యూ సదస్సులో రైతులు, గ్రామస్థులు, వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను తహశీల్దార్‌కు అందజేశారు. గ్రామంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, దాని వల్ల విపరీతంగా దోమలు పెరిగిపోయాయని, డ్రైనేజీల పూడికతీత పారిశుధ్యం పై చర్యలు చేపట్టాలని మహిళలు కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో ఆర్‌వోఆర్‌కు 7, రీసర్వేకు నాలుగు అర్జీలు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సుబ్రహ్మణ్యం, సర్పంచ్ సున్నం ప్ర సాద్, టీడీపీ నాయకుడు నుదురుమాటి శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఊనగట్ల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ ఎం.మెరికమ్మ మాట్లాడుతూ రీసర్వేలోని తప్పులతో పాటు రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 10 అర్జీలు అందాయని తెలిపారు. డీటీ శ్రీనివాసరావు,ఆర్ఐ కమాల్ సర్పంచ్ ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రామగ్రామాన రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. చిడిపి గ్రామంలో 1బి కోరుతూ 9, సర్వే అప్లికేషన్లకు 2 అర్జీలు అందినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, ఆర్ఐ బి.విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ నడిపల్లి అప్పారావు, గ్రామస్థులు మేణ్ణి పార్థసారధి, పామెర్ల నగేష్, చిట్టూరి ప్రసాద్ పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని గుడ్డిగూడెం గ్రా మంలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ కె.అజయ్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం భూసమ స్యల పరిష్కారానికి కృతని శ్చయంతో ఉందన్నారు. దీర్ఘకాలికంగా భూ సమస్యలున్న రైతులు తమ అర్జీలను రెవెన్యూ సదస్సులో ఇవ్వడం ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుంద న్నారు. కార్యక్రమంలో మండల సర్వే యర్ తులసి, వీఆర్వో ప్రసాద్, ఎంపీటీసీ అంజనే యులు, టీడీపీ నాయకుడు జగడాల ఉమానాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చిడిపిలో అర్జీలు స్వీకరిస్తున్న తహశీల్దార్



గుడ్డిగూడెంలో మాట్లాడుతున్న తహశీల్దార్ అజయ్‌బాబు

సెమీ క్రిస్మస్ వేడుకలు

కొవ్వూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): యేసు క్రీస్తు జననం మానవాళికి సంతోషకరమని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ పొలిటికల్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు రెవరెండ్ కె.సాక్షిబాబు అన్నారు. కొవ్వూరులోని ఇందిరమ్మ కాలనీలో గెత్సేమనే ప్రేయర్ హోమ్ మినిస్ట్రీస్ సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్స్ చోళ రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాక్షిబాబు మాట్లాడుతూ పాప ప్రక్షాళన కోసం యే సు జన్మించారన్నారు. అందరూ పరివర్తన చెంది ప్రభువుని ఆరాధించి స్తుతించాలన్నారు. ప్రతిఒక్కరూ ప్రేమ, అప్యాయతలతో మెలగాలన్నారు. అనంతరం ప్రేమ విందు అందించారు. కార్యక్రమంలో సుందరం, సంఘస్థులు పాల్గొన్నారు.

